www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
03-12-2024

సంపుటి : 01 | సంచిక : 211 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ
CMD




# త్వరలోనే గ్రూప్-1 ఉద్యోగ నియామక పత్రాలు

**చిన్న ఆరోపణ లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది**

- దీన్ని రాజకీయ పునరావాసంగా మార్చదల్చుకోలేదు
- బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లేవు
- దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యోగాలు ఊడితేనే.. యువతకు ఉద్యోగాలు వచ్చాయి
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం
- 213 అంబులెన్సులు ప్రారంభించిన ముఖ్యమంత్రి

**విశ్వంభర, హైదరాబాద్:** త్వరలోనే గ్రూప్-1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు. ''563 మంది గ్రూప్- 1 అధికారులను తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములను మిగతా2లో...

## సీఎం ఛైర్మన్‌గా 29మందితో వన్యప్రాణుల కొత్త బోర్డు నియామకం

2

# 'సబర్మతి రిపోర్ట్' చిత్రాన్ని వీక్షించిన ప్రధాని మోదీ

**గోద్రా రైలు దహనకాండ ఆధారంగా సినిమాను తెరకెక్కించిన బాలీవుడ్ దర్శకుడు ధీరజ్ సర్నా**



**ఢిల్లీ:** గుజరాత్ అల్లర్లు, గోద్రా రైలు దహనకాండను ఆధారంగా చేసుకొని తెరకెక్కిన 'ది సబర్మతి రిపోర్ట్'ను పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోదీ వీక్షించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఇతరులు ఈ చిత్రాన్ని చూశారు.2002లో గుజరాత్‌లో గోద్రా రైలు దహనకాండ దేశాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 59 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. దీనిని ఆధారంగా చేసుకొని బాలీవుడ్ మిగతా2లో...

## రాజ్యాంగంపై చర్చకు పార్లమెంటు సిద్ధం!



2

**ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చ**

పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

## జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించాలి

**అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలి**

**సీబీఐ, ఈడీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు**




**ఢిల్లీ:** జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసుల పూర్తి వివరాలు 2 వారాల్లోగా అందించాలని పేర్కొంది. కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలు ఇవ్వాలని ధర్మాసనం చెప్పింది. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు అందించాలని సూచించింది. సీబీఐ, మిగతా2లో...

**ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో**

మృతదేహాలను భద్రపరచాలని

## హైకోర్టు ఆదేశం



తదుపరి విచారణ నేటికి వాయిదా

2


## విద్యుత్ బకాయిలపై తేలని పంచాయితీ

- విభజన అంశాలపై ముగిసిన సీఎస్‌ల భేటీ!
- మూడు అంశాలపై అంగీకారానికి వచ్చినట్లు సమాచారం
- విభజన అంశాలపై చర్చించేందుకు మరోసారి భేటీ కావాలని నిర్ణయం



2

## బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర విచారణకు ఆదేశించండి



- గత ఐదేళ్లలో బియ్యం మాఫియా చెలరేగిపోయింది
- దేశ భద్రతకు సైతం ముప్పు వాటిల్లేలా ఈ స్మగ్లింగ్ సాగింది
- ఒక పెద్ద నెట్వర్క్ ఏర్పాటు చేసి రూ. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు
- చంద్రబాబుకు పవన్ విజ్ఞప్తి

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 85 | రిటైల్ ₹ 107 |
| స్కిన్ ₹ 155 | స్కిన్ లెస్ ₹ 177 |

# రైతుబంధు ఆపింది సీఎం రేవంత్‌రెడ్డే


**బతుకమ్మ చీరలనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టింది**

**ఎల్ఆర్ఎస్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్‌పై అసత్య ఆరోపణలు**

**మీడియా సమావేశంలో హరీశ్‌రావు**

**విశ్వంభర, హైదరాబాద్:** గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక.. ఉన్న రైతుబంధునే ఇవ్వట్లేదు. రైతు, కౌలు రైతు మాట్లాడుకోవాలని సీఎం, మంత్రి అంటున్నారు. రైతుబంధును ఆపింది సీఎం రేవంత్‌రెడ్డే. మిగతా2లో...



## లగచర్ల ఘటనలో నిందితుడు సురేశ్ రాజ్‌కు పోలీస్ కస్టడీ

**రెండురోజుల పాటు విచారణకు కోర్టు అనుమతి**



**విశ్వంభర, కొడంగల్:** లగచర్ల ఘటనలో నిందితుడు సురేశ్ రాజ్‌ను పోలీస్ కస్టడీకి కొండగల్ కోర్టు అనుమతించింది. రెండు రోజుల పాటు విచారణకు అనుమతివ్వడంతో మంగళ, బుధవారాల్లో పోలీసులు అతడిని విచారించనున్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఉన్నతాధికారులపై దాడి కేసులో సురేశ్‌ను పోలీసులు ఏ2గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో ప్రధాన నిందితుడిగా పోలీసులు భావిస్తున్న ఎ2 భోగమోని సురేశ్‌రాజ్ గత నెల 19వ తేదీన కొడంగల్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులకు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించగా, సంగారెడ్డి జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. గత నెల 11న దుద్యాల గ్రామసభలో జిల్లా కలెక్టర్ బృందం నిరీక్షిస్తుండగా, ఆ సమయంలో అక్కడికి వెళ్లిన సురేశ్‌రాజ్ లగచర్లలో ప్రజలు అధికారుల కోసం నిరీక్షిస్తున్నారని నమ్మబలకడంతో ఆ గ్రామానికి అధికారుల బృందం వెళ్లింది. వెంటనే పలువురు దాడికి దిగారు. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై ప్రధాన నిందితునిగా అభియోగం మోపి అరెస్టు చేశారు. కాగా సురేశ్‌రాజ్ ప్రజలను రెచ్చగొట్టారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతను లొంగిపోవడంతో కేసు విచారణ వేగవంతం చేశారు.

## విద్యుత్ బకాయిలపై తేలని పంచాయితీ..

**విశ్వంభర, అమరావతి:** ఏపీ పునర్విభజన అంశాలపై చర్చించేందుకు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల కమిటీ సమావేశం ముగిసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎస్‌ల నేతృత్వంలో ఉన్నతాధికారుల కమిటీ దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. మూడు అంశాలపై అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. విద్యుత్ బకాయిల అంశంపై పంచాయితీ మాత్రం ఎటూ తేలలేదు. రూ.861 కోట్ల మేర లేబర్ సెస్‌ను ఏపీ - తెలంగాణల మధ్య పంపకానికి అంగీకారం కుదిరింది. పన్నుల పంపకాలపై ఇరు రాష్ట్రాల శాఖల అధికారులు సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని అభిప్రాయపడినట్లు సమాచారం. 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పులు పంపకాల అంశమూ తేలలేదు. ఉద్యోగుల మార్పిడి పైనా సీఎస్‌ల కమిటీ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఎక్సైజ్ శాఖకు తెలంగాణ చెల్లించిన రూ.81 కోట్ల బకాయిల అంశం పరిష్కారమైంది. అదనంగా ఇచ్చిన రూ.81 కోట్లు తిరిగి చెల్లించినట్లు ఏపీ తెలిపింది. డ్రగ్స్ నివారణపై సంయుక్త కమిటీ వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్త కమిటీ వేయాలని నిర్ణయానికి వచ్చారు. మరో రెండు అంశాలపైనా సీఎస్‌ల కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం. విభజన అంశాలపై చర్చించేందుకు మరోసారి భేటీ కావాలని సీఎస్‌లు నిర్ణయించారు.

## సీఎం ఛైర్మన్‌గా 29మందితో వన్యప్రాణుల కొత్త బోర్డు నియామకం

**విశ్వంభర, హైదరాబాద్:** వన్యప్రాణుల బోర్డుకు కొత్త సభ్యులను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. 29మందితో ఏర్పాటు చేసిన ఈ బోర్డుకు సీఎం ఛైర్మన్‌గా, అటవీశాఖ మంత్రి వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, పర్యావరణ వేత్తలతో కలిపి మొత్తంగా 29మందితో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, వంశీకృష్ణ, మురళీ నాయక్ భూక్యా, పాయం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

## రాజ్యాంగంపై చర్చకు పార్లమెంటు సిద్ధం!

**ఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటికీ.. విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. పలు అంశాలపై చర్చ జరపాలన్న విషయంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. ముఖ్యంగా రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చించేందుకు తేదీలు ఖరారు చేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయసభలు సజావుగా సాగేలా విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.పార్లమెంటు సమావేశాలు మొదలైనప్పటికీ.. పలు అంశాలపై చర్చించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో విపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ముఖ్యంగా లోక్‌సభలో సంభల్ అంశంపై మాట్లాడేందుకు సమాజ్‌వాదీ పార్టీకి, బంగ్లాదేశ్ పరిస్థితులపై మాట్లాడేందుకు తృణమూల్ కాంగ్రెస్‌కు అనుమతించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

## ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని కోర్టుకు వివరించారు. ఎన్‌హెచ్ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత రేపటి వరకు మృతదేహాలను భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# త్వరలోనే గ్రూప్-1 ఉద్యోగ నియామక పత్రాలు

(మొదటి పేజీ తరువాయి)
చేయబోతున్నాం. చిన్న ఆరోపణ లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. దీన్ని రాజకీయ పునరావాసంగా మార్చదల్చుకోలేదు. అందుకే సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించాం'' అన్నారు.

**విద్య, వైద్యమే మా ప్రాధాన్యత**

''ఏడాదిలోనే 14వేల మందిని వైద్య ఆరోగ్యశాఖలో నియమించడం ఒక చరిత్ర. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలలు ఇచ్చి ఎలాంటి వసతులూ కల్పించలేదు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గత పదేళ్ల పాలనను మీరు ప్రత్యక్షంగా చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. 6500 మందిని వైద్యారోగ్యశాఖలో నియమించాలని నిర్ణయించాం. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లేవు. ఉద్యోగ పరీక్షలు నిర్వహించినా.. పేపర్ లీక్‌ను అరికట్టలేకపోయారు'' అని సీఎం విమర్శించారు.

**ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఉద్యోగాలిచ్చాం!**

''కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యోగాలు ఊడితేనే.. యువతకు ఉద్యోగాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే.. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని యువత నమ్ముతోంది. పరీక్షలు వాయిదా వేస్తూ పోతే.. మీ విలువైన యుక్త వయసు వృథా అవుతుంది. మన భవిష్యత్తు 21 నుంచి 35 ఏళ్ల లోపు మీరు చేసే పనులే నిర్ణయిస్తాయి. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యోగాలు ఇచ్చాం.. ఇదీ మా చిత్తశుద్ధి. గతంలో ఆర్ఎంపీ డాక్టర్‌ను, తహసీల్దార్‌ను టీజీపీఎస్సీ సభ్యులుగా నియమించారు. పునరావాస కేంద్రాలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లను మార్చేశారు. చిన్న ఉద్యోగి పెద్ద పెద్ద ఉద్యోగులను నియమించలేరుగా? పబ్లిక్ సర్వీస్ ఉద్యోగాల గురించి పూర్తి అవగాహన ఉన్న అధికారులే సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాకో మెడికల్ కళాశాల, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రి ఇస్తామన్నారు.. ఇవ్వలేదు.

**213 అంబులెన్సులు ప్రారంభం..**

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 108, 102 వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 108 సర్వీసుల కోసం 136 అంబులెన్సులు, 102 సర్వీసుల కోసం 77 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర



రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఇతర మంత్రులు, నేతలతో కలిసి సీఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. 33 ట్రాన్స్‌జెండర్ల క్లీనిక్‌లను ప్రారంభించడంతో పాటు 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు. మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌లు ప్రతి గురువారం సేవలందించనున్నాయి. కొత్తగా ప్రారంభించిన వాటితో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల సంఖ్య 37కి పెరిగింది.

## బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర విచారణకు ఆదేశించండి



**విశ్వంభర, అమరావతి:** కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర విచారణకు ఆదేశించాలని సీఎం చంద్రబాబును ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో బియ్యం మాఫియా చెలరేగిపోయిందని, దేశ భద్రతకు సైతం ముప్పు వాటిల్లేలా ఈ స్మగ్లింగ్ సాగిందని ఆయనకు వివరించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు పవన్ భేటీ అయ్యారు. కాకినాడ కేంద్రంగా విదేశాలకు బియ్యం అక్రమ రవాణా అంశంపై ప్రధానంగా చర్చించారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఒక పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసి రూ. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని అన్నారు.గత మూడేళ్లలో ఒక్క కాకినాడ పోర్టు నుంచే రూ.48,537 కోట్ల విలువ చేసే బియ్యం ఎగుమతి కావడం మాఫియా విపరీత ధోరణికి నిదర్శనంగా పేర్కొన్నారు. రేషన్ మాఫియాకు కళ్లెం వేసే దిశగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో కాకినాడ పోర్టులోకి ఎవరినీ అనుమతించలేదని, తన పర్యటన సమయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతులు చేసి రూ.కోట్లు కూడబెడుతున్నారని, రాష్ట్రంలో ఏ పోర్టులో జరగని విధంగా కాకినాడ పోర్టులోనే గత ప్రభుత్వ హయాంలో బియ్యం ఎగుమతి జరిగిందని అన్నారు. సమగ్ర విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తీసుకురావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అమరావతిలో చేపట్టబోయే అభివృద్ధి పనులపైనా ఇద్దరు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలతోపాటు ఢిల్లీ పరిణామాలపైనా, నామినేటెడ్ పదవుల నాలుగో జాబితా విడుదలపైనా నేతలు చర్చించినట్లు సమాచారం.

# బెయిల్ వచ్చిన మర్నాడే మంత్రి పదవా?

- ఆశ్చర్యపోయిన సుప్రీంకోర్టు
- సెంథిల్ బెయిల్ రద్దుపై విచారణ జరిపేది లేదు
- సాక్షులు ప్రభావితం అవుతారనే అంశాన్ని విచారణ జరుపుతాం



**ఢిల్లీ:** బెయిల్‌పై విడుదలైన సెంథిల్ బాలాజీ.. కొన్ని గంటల్లోనే తమిళనాడు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యత చేపట్టడంపై సుప్రీం కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అసలు అక్కడ ఏం జరుగుతోందని ప్రశ్నించింది. బాలాజీకి బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన తీర్పును రీకాల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. డీఎంకే నేత సెంథిల్ బాలాజీ బెయిల్‌పై విడుదలైన మరుసటి రోజే కేబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ నిర్ణయం సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం విచారణ చేపట్టింది. ''బెయిల్‌పై విడుదలైన కొన్ని గంటల్లోనే ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సెంథిల్ కేబినెట్‌లో మంత్రి కాబట్టి.. సాక్షులు కచ్చితంగా ప్రభావితం అవుతారనే సందేహాలు వస్తాయి. అసలు అక్కడ ఏం జరుగుతోంది..?'' న్యాయస్థానం ప్రశ్నించింది. ''బెయిల్ మంజూరు విషయంలో మేము సరైన నిర్ణయమే తీసుకున్నాం. అతడి బెయిల్‌ను రద్దు చేయడం గురించి విచారణ జరిపేది లేదు. కానీ, సాక్షులు ప్రభావితం అవుతారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. దీనిపై విచారణ జరుపుతాం'' అని సుప్రీం స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 13కు వాయిదా వేసింది. మనీలాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీ జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబరులో బెయిల్ మంజూరు అయింది. ఆయన బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్ ప్రమోట్ అయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో బాలాజీ కూడా మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

# 'డిప్యూటీ సీఎం రేసులో లేను'

**ఏక్‌నాథ్ శిందే కుమారుడు**



**ముంబయి:** మహారాష్ట్రలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వంలో తాను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తానని వస్తున్న వార్తలు అవాస్తవమని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కుమారుడు శ్రీకాంత్ శిందే పేర్కొన్నారు. మహాయుతి ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు రకరకాల వదంతులు వ్యాపిస్తున్నాయని.. అవన్నీ నిరాధారమైనవని అన్నారు. అనారోగ్యం కారణంగానే ఏక్‌నాథ్ శిందే విశ్రాంతి తీసుకుంటున్నారని తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.''లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్ర మంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ, పార్టీ కోసం పనిచేయాలని భావించి ఆ పదవిని నిరాకరించాను. పదవి కావాలనే కోరిక నాకు లేదు. రాష్ట్ర ప్రభుత్వంలో ఎటువంటి మంత్రి పదవి రేసులో లేనని మరోసారి స్పష్టం చేస్తున్నా. శివసేనతోపాటు నా లోక్‌సభ నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తా. కనీసం ఇప్పటికైనా నా గురించి చర్చలు ఆగిపోతాయని ఆశిస్తున్నా'' అని శ్రీకాంత్ శిందే పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ.. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో మహాయుతి కూటమి తీవ్ర జాప్యం చేస్తోంది. కూటమి పార్టీలకు పదవుల కేటాయింపు కొలిక్కి రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా సీఎం పదవి దేవేంద్ర ఫడణవీస్‌కు ఖరారైన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పదవి శిందే కుమారుడు శ్రీకాంత్‌కు (ప్రస్తుతం ఎంపీ) ఇవ్వనున్నారనే వార్తలు వినిపించాయి. వీటిపైనే తాజాగా శ్రీకాంత్ శిందే స్పందించారు.

**శిందేకు ఫడణవీస్ ఫోన్..**

కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ఫోన్ చేసి పరామర్శించినట్లు సమాచారం. మరోవైపు భాజపా శాసనసభా పక్ష నేతను ఎన్నుకునేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం పార్టీ పరిశీలకులుగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీలను నియమించినట్లు భాజపా ఓ ప్రకటనలో తెలిపింది.

## రైతుబంధు ఆపింది సీఎం రేవంత్‌రెడ్డే



(మొదటి పేజీ తరువాయి)
రైతుబంధు, బీమా ద్వారా రైతులకు రూ.82 వేల కోట్లు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. బతుకమ్మ చీరలనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టింది.గతంలో ఎల్ఆర్ఎస్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్‌పై అసత్య ఆరోపణలు చేశారు. రూ.15 వేల కోట్లు ప్రజల నుంచి కట్టించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలి. పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు అడుగుతుంటే ప్రతిపక్షాల కుట్ర అంటున్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో సర్వే చేస్తే ఆరోపణలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సర్వే ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చెప్పాలి. గతంలో మాట్లాడిన మాటలపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలి'' అని హరీశ్‌రావు హితవు పలికారు.

## 'సబర్మతి రిపోర్ట్' చిత్రాన్ని వీక్షించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)
దర్శకుడు ధీరజ్ సర్నా 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను తెరకెక్కించారు. విక్రాంత్ మాస్సే, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటించారు. రిధి డోగ్రా కీలకపాత్ర పోషించారు. నవంబర్ 15న ఇది విడుదలైంది. ప్రతిఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పక చూడాలని ఇటీవల ఓ నెటిజన్ చేసిన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'కల్పిత కథనాలు పరిమితకాలమే కొనసాగుతాయి. సామాన్యులకు కూడా అర్థమయ్యేరీతిలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి)
ఈడీ కేసుల వివరాలు విడివిడిగా చార్ట్ రూపంలో అందించాలంది. అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఆలస్యమవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు గతంలో పిటిషన్ వేశారు. కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్నారు. దీనిపై విచారణను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం చేపట్టింది. వాదనల సందర్భంగా.. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు ఇరుపక్షాల న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ ఇన్నేళ్లపాటు ఎందుకు ఆలస్యమవుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టుల్లో విచారణ పెండింగే కారణమని న్యాయవాదులు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలిస్తే తగిన ఆదేశాలు ఇస్తామని ధర్మానం చెప్పింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ట్రయల్ కోర్టు, పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

## మావోయిస్టులపై విష పదార్థాలు ప్రయోగించారనడం దుష్ప్రచారం: డీజీపీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఏటూరునాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ అంశంపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. మావోయిస్టులపై విష పదార్థాలు ప్రయోగించారనేది దుష్ప్రచారమేనన్నారు. వారు స్పృహ కోల్పోయాక కాల్పులు జరిపామనడం అవాస్తవమని తెలిపారు. ''పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. హైకోర్టు, ఎన్‌హెచ్ఆర్‌సీ సూచనల మేరకే శవపరీక్షలు నిర్వహించాం. ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించాం'' అని వివరించారు.



# కేసీఆర్ వల్లే తెలంగాణ ప్రజలకు గౌరవం దక్కింది

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ





**విశ్వంభర, హైదరాబాద్ :** చిన్న చిత్రంగా విడుదలై పెద్ద విజయాన్ని సాధించిన కేసీఆర్ చిత్ర యూనిట్‌కు సోమవారం త్యాగరాయ గానసభలో కళానిలయం సేవాసంస్థ, వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి, జీ దేవిప్రసాద్ రావు, మాజీ డీసీపీ సుంకర సత్యనారాయణ, ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా కాచం సత్యనారాయణ, చకిలం స్వప్న శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణకు పెద్ద వరం అన్నారు. అటువంటి వ్యక్తి జీవిత చరిత్రను ఏంతో ధైర్యం చిత్రంగా నిర్మించిన రాకేశ్, ఆయన సతీమణికి ధన్యజీవులు వారు మున్ముందు ఇంకా పెద్ద విజయాలను సాధించాలని అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు, ప్రస్తుత పరిస్థితులు వేరన్నారు. తెలంగాణ ప్రజలకు గౌరవం దక్కిన అదృష్టం కేసీఆర్ వల్లనే సాధ్యమైందన్నారు. సంగీత నృత్య ప్రదర్శనలతో కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో కళాలయం సంస్థ అధ్యక్షురాలు పుష్పలత, కార్యదర్శి సురేందర్, ప్రముఖ వైద్యులు డా. వీరభోగ వసంతరాయలు పాల్గొన్నారు.



నల్లగొండ రామగిరిలోని.. తల్లం గిరీష్ కుమార్ నివాసంలో... ఆయన తల్లి తల్లం రాజ్యలక్ష్మి దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించికుటుంబ సభ్యులను పరామర్శించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ కాచం సత్యనారాయణ. వారివెంట తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కోదుమూరు దయాకర్ రావు, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, ఇరుగు శ్రీధర్, కాసం శేఖర్, బెస్ట్ సేవ సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య, నల్గొండ పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, మెరుగు గోపి,రాపోలు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, నల్లగొండ

# పోలీసులపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలి

## డీఎస్పీ తిరుపతి రావు



**విశ్వంభర, మహబూబాబాద్ :** పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని మహబూబాబాద్ డిఎస్పీ ఎన్.తిరుపతిరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ను మహబూబాబాద్ డిఎస్పీ ఎన్.తిరుపతిరావు తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్ ను పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో తో రూరల్ సీఐ సరవయ్య, ఎస్.ఐ దీపిక తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా రక్షణే ధ్యేయం

## - ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**విశ్వంభర, ఖమ్మం :** సమాజంలో పెరిగిపోయిన నేర ప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటు అయిన డయల్ 100 కు నవంబర్ 2024 3 3,431 5 వచ్చాయని వీటిపై 67 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేశామని వీటిలో దొంగతనాలు 10, సాధారణ ఘాతలు 19, యాక్సిడెంట్లు 11, అనుమానాస్పద మరణాలు 2, ఇతర కేసులు 25 అని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది వ్యక్తులు డయల్ 100 పై అవగాహన లేకపోవడం వలన ఫేక్ కాల్స్ చేస్తున్నారని అలా చేయవద్దని అత్యవసర పరిస్థితులలో మాత్రమే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం అన్ని వేళల్లో 24*7 పొందవచ్చునని తెలిపారు.

# తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ విద్యార్థులకు సన్మానం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ జ్ఞానసుధ శిక్షణ కేంద్రంలో తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలల డిజిటల్ మార్కెటింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్షితిజా, వైస్ చైర్మన్, డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ తెలంగాణ అధ్యక్షత వహించారు. అలాగే ఎం. ఆనంద్, జనరల్ మేనేజర్, ఎస్సి కార్పొరేషన్ తెలంగాణ, ప్రవీణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు కోర్సు పూర్తి సర్టిఫికెట్‌లు, ఉపాధి ఆఫర్ లెటర్‌లను అందజేశారు. విద్యార్థుల కృషిని జ్ఞానసుధ విద్యా సమాజం అందించిన నాణ్యమైన శిక్షణను ప్రశంసించారు. ఈ శిక్షణ జ్ఞానసుధ విద్యా సమాజం వ్యవస్థాపకుడు శ్రీనివాస్ దేవర్షెట్టి నేతృత్వంలో నిర్వహించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, మెరుగైన ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. ప్రభుత్వ పథకాల మద్దతుతో జ్ఞానసుధ విద్యా సమాజం విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకువస్తోంది. కార్యక్రమం విద్యార్థుల కృతజ్ఞతాభినందనలతో ముగిసింది. శిక్షణ, ఉపాధి అవకాశాలు తమ జీవితాలను మరింత మెరుగ్గా మార్చుతాయని విద్యార్థులు సంతోషంగా తెలిపారు.

# అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన నందిగామ అయ్యప్ప ఆలయం




**విశ్వంభర, నందిగామ :** అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అన్నదానం చేయడం మహా పుణ్యమని ఎస్ బి పల్లి మాజీ కోఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగారం సురేష్‌గౌడ్ అన్నారు. సోమవారం నందిగామ మండలంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎస్ బి పల్లి మాజీ కోఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగారం సురేష్‌గౌడ్ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసే అవకాశం దొరకటం చాలా గొప్ప అదృష్టమనీ అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని ఎస్ బి పల్లి మాజీ కోఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగారం సురేష్‌గౌడ్ అన్నారు.

# జ్యువెలర్స్ షోరూంను ప్రారంభించిన ఫెమినా మిస్ ఇండియా



**విశ్వంభర, హైదరాబాద్ :** ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2024 భవ్య రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ శివేక్ మోడల్‌స్‌తో కలిసి కొంపల్లి, సినీ ప్లానెట్ ఎదురుగా పి.సత్యనారాయణ & సన్స్ జ్యువెలర్స్ 8వ షోరూంను ప్రారంభించారు. "ఈ కొత్త షోరూమ్ సొబగులు, ఆవిష్కరణలతో ప్రతిధ్వనించే అద్భుతమైన ఆభరణాల తయారీలో మా 75 ఏళ్ల వారసత్వంలో మరో మైలురాయిని సూచిస్తుందని తెలిపారు శివేక్. పి సత్యనారాయణ కుమారులు కొంపల్లిలో కొత్తగా ప్రారంభించిన షోరూమ్‌తో పాటు గుల్జార్ హౌస్, మచిలీ కమాన్, మెహదీపట్నం, బషీర్‌బాగ్, జూబ్లీహిల్స్ మరియు కూకట్‌పల్లిలో తమ షోరూమ్‌లను కలిగి ఉన్నారు.





# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, సూర్యపేట:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజక వర్గం మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996 97 పదవ తరగతి విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని డిసెంబరు 01, 2024 ఆదివారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ ఒక చోట చేరి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందోత్సాహాల మధ్య గడిపారు. అప్పటి ఉపాధ్యాయులకు శాలు వాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్ రెడ్డి, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, షహీదా బేగం, రుద్ర వేణు, కృష్ణ మూర్తి, రమేష్, శివయ్య, వీరయ్య, ఉమా, రాధిక, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# సూర్యుడి రహస్యాలను ఛేదించేందుకు ప్రోబా-3



## నేడు ఇస్రో మరో కీలక ప్రయోగం

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోసారి చరిత్ర సృష్టించేందుకు రెడీ అయ్యింది. భానుడి రహస్యాలను ఛేదించేందుకు సిద్ధమైంది. గతంలో ఆదిత్య ఎల్-1 మిషన్‌ను చేపట్టిన ఇస్రో తాజాగా.. ప్రోబా-3 మిషన్ ప్రయోగించబోతున్నది. వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములయ్యారు. మిషన్ ప్రయోగం బాధ్యతలను ఇస్రో తీసుకుంటుండగా.. శాటిలైట్‌ను నింగిలోకి ఇస్రో విజయవంతమైన రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (పీఎస్ఎల్వీ) తీసుకెళ్లనున్నది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఎ) ప్రోబా-3 మిషన్‌ను డిసెంబర్ 4న ఏపీలోని శ్రీహరికోట స్పేస్‌పోర్ట్ నుంచి ప్రయోగించనున్నట్లు ఇస్రో వెల్లడించింది.

సూర్యుడి అధ్యయనం కోసం ఐరోపా స్పేస్ ఏజెన్సీ చేపట్టిన ప్రోబా-3 మిషన్‌ను తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్నట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. సోలార్ రిమ్‌కు దగ్గరగా సూర్యుని కరోనాను అధ్యయనం చేయడానికి ఉద్దేశించిన ప్రోబా-3ను పీఎస్ఎల్వీ(ఎక్స్ఎల్) రాకెట్ ద్వారా డిసెంబరు 4న సాయంత్రం 4 గంటలకు నింగిలోకి పంపుతున్నట్టు తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (NSIL) సహకారంతో ప్రోబా-3ని ప్రయోగించబోతున్నారు. ప్రోబా-3తో పాటు 144 మీటర్ల పొడవైన సోలార్ కరోనాగ్రాఫ్‌ను కూడా పంపుతున్నట్టు పేర్కొంది.మిషన్‌లో భాగంగా 550 కిలోల బరువున్న ఉపగ్రహాలను ప్రత్యేకమైన దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంచనున్నట్లు ఇస్రో పేర్కొంది. ఇది సంక్లిష్ట కక్ష్యలోకి ఖచ్చితత్వంతో ప్రయోగం నిర్వహించేందుకు విశ్వసనీయతను పీఎస్ఎల్వీ బలోపేతం చేస్తుందని పేర్కొంది. మిషన్‌లో భాగంగా యూరోపియన్ ఏజెన్సీ సూర్యుడి వాతావరణంలోని బయటి, అత్యంత వేడిపొర అయిన సోలార్ కరోనాను అధ్యయనం చేయనున్నది. ప్రోబా-3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. ఈ రెండు కలిసి సూర్యుడిపై జంటగా పరిశోధనలు సాగించనున్నాయి. ఇక, భారత్ సొంతంగా ఆదిత్య ఎల్ 1 పేరుతో మొదటిసారి సూర్యుడిపై అధ్యయనానికి స్పేస్ ప్రోబ్‌ను గతేడాది పంపిన విషయం తెలిసిందే. అత్యంత ప్రకాశవంతమైన సూర్యుడి కరోనాను అధ్యయనం చేయడానికి శాస్త్రవేత్తలకు ఈ మిషన్ సహాయపడుతుంది. ఈ జంట ఉపగ్రహాలను భూమి నుంచి 66 వేల కిలోమీటర్ల అత్యంత ఎత్తులోని దీర్ఘవృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెడతారు. అక్కడకు చేరుకునే క్రమంలో ఇవి ప్రతి కక్ష్యలో 600 కి.మీ. దగ్గరగా వెళ్తాయి. అత్యంత ఎత్తులో ఉండే ఈ కక్ష్య ..ఉపగ్రహాలు గరిష్ట ఎత్తులో సుమారు ఆరు గంటల పాటు ఎగరడానికి తోడ్పడుతుంది. ఇక్కడ భూమి గురుత్వాకర్షణ ప్రభావం తక్కువగా ఉండటం వల్ల ప్రొపెల్లెంట్ వినియోగాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు, ఇది సరైన స్థాన నియంత్రణకు అనుమతిస్తుంది. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి ఆల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా-3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించబోతున్నారు. ఈ రెండేళ్ల సుదీర్ఘ మిషన్ ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండాపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. 'ప్రపంచంలోనే మొట్టమొదటి ఖచ్చితమైన నిర్మాణ ఫ్లయింగ్ మిషన్'.. సూర్యుని అంతుచిక్కని కరోనాను అపూర్వమైన సామీప్యత సహా కీలక రహస్యాలను తెలుసుకోడానికి శాస్త్రవేత్తలకు అవకాశం కల్పిస్తుందని ఐరోపా స్పేస్ ఏజెన్సీ ప్రకటించింది. 'జంట ఉపగ్రహాలు కలిసి ప్రయాణించి.. అంతరిక్షంలో ఒకే దృఢమైన నిర్మాణంలా స్థిరంగా ఉంటూ సూర్యుడి కరోనాపై అధ్యయనం సాగిస్తాయి' అని ఈఎస్ఏ పేర్కొంది.ప్రోబా-3 అనేది 2001లో ఐరోపా స్పేస్ ఏజెన్సీ చేపట్టిన ప్రోబా-1 మిషన్‌కు కొనసాగింపు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఓ మిషన్‌ను ఇస్రో చేపట్టడం ఇదే మొదటిసారి. ప్రోబా-3 ఉపగ్రహాలను బెల్జియంలోని లీజ్ నుంచి చెన్నై విమానాశ్రయానికి తరలించి, అక్కడ నుంచి శ్రీహరికోటకు రోడ్డు మార్గంలో ట్రక్ ద్వారా పంపారు. షార్ కేంద్రంలో ఈఎస్ఏ బృందం.. ఇస్రో శాస్త్రవేత్తలతో కలిసి ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధం చేస్తోంది.



# ధర్మాన్ని సదా రక్షించాలి

> "ధర్మ ఏవ హతోహంతి, ధర్మో రక్షతి రక్షితః
> తస్మాత్ ధర్మో న హంతవ్యో, మానో ధర్మోహతోవధీత్"
> అని మనుస్మృతిలో చెప్పబడింది

దీని ప్రకారం ధర్మాన్ని బాధిస్తే అది తిరిగి మననే బాధిస్తుంది. ధర్మ రక్షణ చేస్తే అది మనలను రక్షిస్తుంది. కాబట్టి ధర్మాన్ని నాశనం చేయకూడదని దీని అర్థం. అంటే "చంపబడిన ధర్మం ఆ ధర్మాన్ని చంపినవాణ్ణి చంపుతుంది. రక్షింపబడిన ధర్మం అ ధర్మాన్ని రక్షించినవారిని రక్షిస్తుంది కనుక, ధర్మం చేత మనం ఎప్పుడూ చంపబడకుండా శుద్ధిగా మనం ఆ ధర్మాన్ని సదా రక్షించాలి" అని తెలుసుకోవాలి. మనమందరం ఒక విషయాన్ని గమనించాలి. "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అని భగవంతుడే స్వయంగా చెప్పాడు కదా! చెప్పినట్లుగానే యుగయుగాలో ఈ జగాన పలు అవతారాలెత్తి ధర్మాన్ని స్థాపించడం కోసం ఎందరో దుష్టులను శిక్షించినట్లుగా, శిష్టులను రక్షించినట్లుగా వేదాలు, పురాణాలు చెబుతున్నాయి కదా!.రామాయణం ఆధారంగా ధర్మం గూర్చి ప్రస్థావించుకుందాం. ధర్మాచరణ గూర్చి కొంత తెలుసుకుందాం.హిందువుల ఆరాధ్య ప్రామాణిక ఇతిహాసమైన రామాయణంలోని కథా నాయకుడు అయిన రాముని గురించి '"రామో విగ్రహవాన్ ధర్మః " అని చెప్పారు కదా మహర్షి వాల్మీకి. అంటే ధర్మమనేది ఒక రూపం దాలిస్తే ఆ రూపమే శ్రీరాముడుఅంతే కాకుండా ధర్మమార్గంలో ఎలా రాజ్యాన్ని పరిపాలించాలో చెప్పాడు. చెప్పిన విధంగా చేసి చూపాడు రాముడు. మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా చేసి చూపాడు రాముడు. మనసులో వున్నట్లుగా ఆలోచన, ఆలోచించినట్లుగానే చెప్పే మాట, మాటల్లో చెప్పినట్లుగా పని చేసి చూపించిన గొప్ప ధర్మాత్ముడు శ్రీ రాముడు. ఆయన ఏ సమయంలోనూ తన ధర్మాన్ని అతిక్రమించలేదు. ఆయన చెప్పాడు. చెప్పిన దానిని అనుసరించాడు. ఇతరులను అనుసరింపచేసాడు. అందుకనే ఆయన మహానుభావుడు లోకోత్తరనాయకుడు అయినాడు. ఒక చోట తండ్రి దశరథుని ఆనతి ప్రకారం పదునాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేయడానికి నారబట్టలు కట్టుకొని అడవులకు వెళ్ళాడు. కొద్ది రోజులకు తండ్రి చనిపోయాడు. ఆజ్ఞాపించిన తండ్రి దశరథుడు చనిపోయాడు ఆయన మాటలు పట్టించుకోనవసరం లేదు. కాబట్టి మీరు రాజ్యానికి వచ్చి రాజ్య పాలన చేయవచ్చు అని దశరథుని పురోహితుడు జాబాలి మొదలైన కొందరు రాముడిని ఒప్పించడానికి వాదించారు. నా తండ్రి చనిపోయినా బ్రతికున్నప్పుడు ఆయన ఆజ్ఞ ప్రకారం నేను వారికిచ్చిన మాట ప్రకారం నేను పదునాలుగు సంవత్సరాలు అరణ్య వాసం చేసి వస్తాను అదియే నేను ఆయనకు పుత్రునిగా నిర్వర్తించాల్సిన ధర్మం అని తండ్రికిచ్చిన మాట ప్రకారం రాజ్యానికి రానన్నాడు. అదీ వాక్ ధర్మమంటే. పలికిన మాట నిలబెట్టుకోవడమంటే. అందుకనే శ్రీ రాముడు సత్య వాక్పరిపాలకుడు, పితృవాక్యపరిపాలకుడు అయినాడు.

మరొక సందర్భంలో వాలి వధానంతరం సుగ్రీవుడి పట్టాభిషేక మహోత్సవ వేళ సుగ్రీవుడు రాముడుని కిష్కింధా రాజ్యానికి రమ్మని ప్రార్థించాడు. తండ్రికిచ్చిన మాట ప్రకారం పద్నాలుగేండ్లు గ్రామాలు, నగరాలు, పట్నాలు, రాజ్యాలలో అడుగు పెట్టను. అడవులలో వుంటానన్నాడు రాముడు. అదీ రాముడు పాటించిన ధర్మం. ఆ మహనీయుని గురించి ఇలా ఎన్నో ధర్మ విషయాలు చెప్పుకోవచ్చు. ఇంకో ధర్మ విషయం గురించి

"మాతృవత్ పరదారేషు పరద్రవ్యేషు లోష్టవత్ |
ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి స పణ్డితః"||

'ఇతరుల భార్యలను తల్లులుగా, ఇతరుల ధనాన్ని మట్టిబెడ్డలుగా ఎవరైతే భావిస్తారో అతడు జ్ఞాని''అని అర్థం. ఇది ప్రతి మనిషి పాటించాల్సిన ప్రామాణిక ఆదర్శనీయమైన ధర్మం. దీనిని పాటించేవాళ్ళందరూ పుణ్యాత్ములు, మహానుభావులు. పాటించనివాళ్ళు ఎన్ని ఇబ్బందులు పడ్డారో పురాణాలలో ఎన్నో కథలు వున్నాయి.ఈ ధర్మవాక్యం గురించి కూడా రామాయణంలో వున్నది. అసలు రామాయణ కథ మొత్తం నడిచినది ఈ ధర్మ వాక్యాన్ని అతిక్రమించడం వలనే అని చెప్పవచ్చు. పరమ శివ భక్తుడు అయిన రావణాసురుడు ఈ ధర్మాన్ని అతిక్రమించాడు. రాముని భార్య సీతాదేవిని బలవంతంగా ఎత్తుకెళ్ళిపోయాడు. పెళ్ళి చేసుకొమ్మని నిర్భందించాడు. కనుకనే అంతటి పరమ శివభక్తుడై వుండి కూడా పైగా అధిక బలవంతుడు గొప్పవాడు అయినప్పటికీ ఇతరుల భార్యను అపహరించాడనే ధర్మాన్ని అతిక్రమించాడు కనుకనే కుటుంబమే కాదు మొత్తం వంశంతో నాశనమైపోయాడు. ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు కాబట్టే రాముడు అతనిని సంహరించాడు.

అదే విధంగా ఈ వాక్యంలో చెప్పిన ఇంకో విషయం ఇతరుల సొమ్మును మట్టి బెడ్డలతో సమానంగా చూడమని వుంది కదా. మట్టి బెడ్డలుగా కాదు గడ్డి పరక కన్నా హీనంగా చూసింది కాబట్టే ఆ మహాతల్లి పతివ్రత అయినది. లోక పావని అయినది. పరమ పూజ్యురాలైనది సీతాదేవి.

రామాయణంలో సీతాదేవిని అపహరించిఎత్తుకెళ్ళి, తన వైభోగాన్ని, తన రాజ్యాన్ని చూపి తనను చేపట్టమని, పట్టపురాణి వైభోగాన్ని ఇస్తానని చెప్పాడు రావణాసురుడు. వాటినన్నిటిని చూసి, విని, వానినన్నిటినీ గడ్డి పరకతో సమానమన్నది. అంతే కాకుండా రావణుడితో ప్రత్యక్షంగా మాట్లాడకుండా గడ్డిపరకనడ్డుగా పెట్టి ఆ గడ్డి పరకతో మాట్లాడినది ఆ మహా సాధ్వి. ఆ మహాతల్లి సతీ ధర్మాన్ని,పాతివ్రత్య ధర్మాన్ని పాటించడమే కాకుండా ఇతరుల ద్రవ్యాన్ని గడ్డి పరక కన్నా హీనంగా భావించింది కాబట్టే ఆ మహా సాధ్వి పతివ్రతా శిరోమణి అయినది.

ఇలా రామాయణం లో అనేకానేక సంఘటనలు పరిశీలించినప్పుడు మనకు చాలా ధర్మ విషయాలు తెలుస్తాయి. చూడండి రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకెళ్ళే సమయంలో ఆమెను ముట్టుకోకుండా ఆమె పడిపోయిన భూభాగాన్ని ముక్కగా కోసి లంకకు తీసుకెళ్ళాడని వుంది కదా అదే విధంగా అశోక వనంలో సీతాదేవిని వుంచి పన్నెండు మాసాలు గడువిస్తున్నాను అప్పటిలోగా మనసు మార్చుకొని నా వద్దకు చేరాలి ఒకవేళ మనసు మార్చుకోకపోతే నిన్ను వుటవాళ్ళు నా ఉదయ పలహారంగా సిద్ధం చేస్తారు

అని చెబుతూ రాక్షస స్త్రీ లను కాపాలా వుంచాడు కదా. అదీ రాక్షసుడు అయివుండీ బలపరాక్రమవంతుడైవుండీ కూడా పరాయి ఆడదానిమీద చేయి వేయకుండా ఏ మాత్రం బలవంతం చేయకుండా గడువిచ్చాడు కదా (పరాయి ఆడదాని అంగీకారం లేకుండా ఆమెను తాకితే మరణిస్తాడని రావణాసురుడికి శాపం వుంది) బహుశా అందువలననే సీతాదేవిని తాకకుండా జాగ్రత్త పడివుండొచ్చు. రాక్షసుడు అయివుండీ కూడా పరాయి ఆడదాని అంగీకారం లేకుండా అనే ధర్మాన్ని పాటించాడని చెప్పుకోవచ్చు. ఇంకో చోట అరణ్యవాసం చేయడానికి వెళ్తున్న రామునితో తల్లి కౌసల్య దేవి వస్తానంటే భర్త ఎక్కడ వుంటే భార్య అక్కడే వుండాలి అని భార్య ధర్మాన్ని చక్కగా చెప్పటమే కాకుండా ఎండ కన్నెరుగని సుకుమారి అయిన తన భార్య సీతాదేవిని తనతో అడవులకు తీసుకెళ్ళాడు రాముడు. భార్యాభర్తల ఆదర్శ దాంపత్య ధర్మానికి ప్రతీకగా నిలిచాడు రాముడు.

అదే అరణ్యవాసంలో భరతుడు ససైన్యంగా రావడాన్ని చూసిన లక్ష్మణుడు భరతుడు గూర్చి పలికిన సందేహాస్పద మాటలకు నీకేమైనా రాజ్యకాంక్ష వుంటే చెప్పు భరతుడితో చెప్పి ఇప్పిస్తానని రాముడు అనగానే నాకు రాజ్యమే కాదు పద్నాలుగు భువనాలను పాలించే అధికారం వచ్చినా నాకు వద్దు మీ పాద సేవయే నాకు స్వర్గాధిపత్యం కన్నా అధికం అన్నాడు లక్ష్మణుడు. అదే విధంగా మీరు తిరిగొచ్చేవరకూ నేను అయోధ్యలో అడుగుపెట్టను. నందిగ్రామంలో వుంటూ మీ పాదుకలను పూజిస్తూంటాను మీరు పద్నాలుగు సంవత్సరాల అరణ్యవాసం పూర్తి అయిన మరునాడు మీరు నాకు కనబడకపోతే ఆత్మాహుతి చేసుకుంటానంటాడు భరతుడు. లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, ఇలా ఎవరికి వారే అన్నగారి పట్ల చూపించాల్సిన ధర్మాన్ని ఆయా సందర్భాలలో ప్రదర్శించారు. ఇలా రామాయణంలో ప్రతీ సన్నివేశం ప్రతీ పాత్రా మనకు ఆదర్శనీయమైన ఆచరణీయమైన ధర్మాన్ని వివరిస్తునే వుంది.

**ఈ విధంగా ధర్మాన్ని పాటించేవాళ్ళు ఈరోజుల్లో ఎక్కడైనా వున్నారా?**

ఎవరు ఎట్లా పోతే నాకెందుకు నాకు పదవి వస్తే చాలనుకునేవారు. పదవులకోసం తల్లి, తండ్రి, భార్యా, భర్తా, అన్నదమ్ములు, కడుపున పుట్టినవాళ్ళని కూడా లెఖ్ఖ చేయకుండా తన ఆస్థికి, హోదాకి, పదవులకి, గౌరవాలకి అడ్డొచ్చిన వాళ్ళని అడ్డు తొలగించుకొని గొప్పవాళ్ళైపోతున్నారు. ధర్మం ఎక్కడ వుంది? న్యాయమంటే ఏమిటి?నిజానికి వున్న శక్తి ఏమిటి? అనే విషయాలు తెలుసుకోకుండా పెద్దవాళ్ళు ప్రవర్తిస్తుంటే వాళ్ళని చూసి పిల్లలు ఎలా తయారవుతారో ఆలోచించండి. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? ఒకసారి ఆలోచించండి. ఈ రోజున డబ్బు సంపాదన యావలో పడిపోయి భార్య ఒకచోట భర్త ఒకచోట వుంటూ పలు ఇబ్బందులు పడ్తున్నారు కదా!.. తల్లి దండ్రులు ముసలి వాళ్ళైపోయారనే వంకతో తమ స్వేచ్ఛకు అడ్డొస్తున్నారని తీసుకెళ్ళి ఎక్కడో వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులను, ఛైల్డ్ కేర్ సెంటర్స్ లో, రెసిడెన్షియల్ స్కూల్ తో దోపిడి చేస్తున్న హాస్టల్స్ నందు పిల్లలును చదువుల పేరుతో జాయిన్ చేస్తున్నారు కదా! వాళ్ళకి, వీళ్ళకి ఎటువంటి సంబంధాలు వుంటాయి?. రక్తసంబంధాలు, మానవ సంబంధాలు కన్నా మనీ సంబంధాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న నేటి నవ తరం వారికి

**ధర్మాలు, నైతిక విలువలు అర్థమవుతాయా?**

ప్రతీ వారు తమ సొంత పనుల్లో బిజీ అయిపోతూ కుటుంబసభ్యులతో కన్నా తమ అవసరాలకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వస్తువులు, మీడియాలతో ఎక్కువ కాలక్షేపం చేస్తున్నారు. వాటిని రిమోట్ చేస్తూ ఉపయోగించుకుంటున్నామనుకొంటున్నారు కానీ వాటి చేతుల్లో బందీలైపోతూ విలువలు కోల్పోతున్నారు నేటి తరం వారు. అందుకనే ఇప్పటికైనా కళ్ళు తెరిచి వాస్తవాలను గ్రహించాలి. సమయం సందర్భం కుదుర్చుకొని కుటుంబ సభ్యులతో గడపాలి. ధర్మానికి నిలయాలైన ఇతిహాసాలు పురాణాలు గురించి మాట్లాడుకోవాలి. వారంలో రెండు మూడు రోజులకైనా ఏదొక గుడిగోపురానికి అందరూ కలిసి వెళ్ళాలి. మన వంశం మన కుటుంబం లోని పూర్వీకులు పెద్దలు గురించి వివరించి చెప్పాలి. ధర్మాన్ని ఆచరించటానికి అనువైన వాటిని తెలుసుకోవాలి. ధర్మాన్ని రక్షిస్తే ధర్మమే మనలను కాపాడుతుందని చెప్పాలి. అందుకనే ""ధర్మో రక్షతి రక్షితః.."""



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 8247433432

# దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ఐడీఓసీ కార్యాలయంలో ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు ఇవ్వడానికి మూడు చక్రాల సైకిల్‌పై వచ్చిన దివ్యాంగుడిని పింఛను వస్తుందా? ఎంత వస్తుందని ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ వస్తుందని ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం అందించాలని కోరగా.. పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ అధికారిని ఆదేశించారు.

**తృణధాన్యాలతో ఆరోగ్యానికి మేలు**

తృణ ధాన్యాలతో కూడిన ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, మారుతున్న జీవనశైలిలో తృణ ధాన్యాల వినియోగం కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు చెల్పూర్ మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన తృణ ధాన్యాల కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడి కేంద్రాల్లో తృణ ధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.

**కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారుల పర్యటన**

కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థాయి పర్యటన ఉద్యోగ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాకు 10 రోజుల పర్యటకు విచ్చేసిన ఆరుగురు సభ్యులు గల కేంద్ర సెక్షన్ అధికారుల బృందం కాటారం, రేగొండ మండలాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, పార్కులు, డంపింగ్ యార్డులు తదితర పథకాలను పరిశీలించామని తెలిపారు. పర్యటన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సెక్షన్ అధికారులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 26 వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు అధికారులు జిల్లాలోని కాటారం మండలంలోని గంగారం, నస్తూరు పల్లి, రేగొండ మండలంలోని రంగయ్య పల్లి, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఓ నారాయణ రావు, ఆర్డీఓ మంగిలాల్ పాల్గొన్నారు.

**జిల్లాలో 2కె రన్**

ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న 2 కే రన్ లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లాలోని రెండవ డివిజన్ వంగపహాడ్‌లో పునీత ఆంటోనీ చర్చిలో ఫాదర్ జేరూమ్ ఆధ్వర్యంలో వితంతువుల క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెరోం ఫాదర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను పిల్లలు గౌరవించాలన్నారు. భర్తలు చనిపోయిన వితంతువులకు ఆదరాభిమానాలు తగ్గి ఎన్నో బాధలకు గురవుతున్నారన్నారు. అలాంటి వారిని ప్రతి ఒక్కరూ గౌరవించడంతో పాటు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వితంతువుల క్రిస్మస్ వేడుకల రోజున వారిని గౌరవించడం ఎంతో మంచి పరిణామమన్నారు. అనంతరం కరుణాపురం ఫాదర్ భాస్కర్‌ను శాలువాతో సత్కరించారు. అదే విధంగా వితంతువులకు భోజన వసతి కల్పించడంతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరుణాపురం ఫాదర్ భాస్కర్, ఆసీస్ స్కూల్ సిస్టర్స్, సంఘం పెద్దలు దోమ కుమార్, కిషోర్, ప్రసాద్, బి.ప్రసాద్, అడుగురి స్వామి, దేవయ, మురళి, విజయ్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన వట్టే జానయ్య



**విశ్వంభర, హైద్రాబాద్:** తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ కుల గణనకు ప్రభుత్వం సహకరించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ మేరకు బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు ప్రకటించి బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. అలాగే ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, పంటకు గిట్టుబాటు ధర, రూ.500 బోనస్, రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వానికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** వివిధ రకాల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా 18 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అలసత్వం వహించవద్దని ఎస్పీ పేర్కొన్నారు.

# ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్:** సమాచార హక్కుచట్టం కమిషనర్లను నియమించాలని మాదగోని సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ కార్యాలయంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాదగొని సత్యం మాట్లాడుతూ ఆర్టీఐ కమిషనర్ ఆఫీస్ లో కమిషనర్‌లు లేక వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలన్నారు. తెలంగాణలో వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయలలో ఎన్నో ఆర్టీఐ దరఖాస్తులకు సరైన సమాధానాలు ఇవ్వకుండా ఆర్టీఐ కార్యకర్తలకు అధికారులు స్పందించక నిర్లక్ష్యం చేస్తూ దరఖాస్తులు వేలల్లో పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆర్టీఐ దరఖాస్తులకు స్పందించి తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం,తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్,యాదగిరి ముదిరాజ్,శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో భోజన ఏర్పాట్ల పరిశీలన



**విశ్వంభర, మీర్‌పేట్:** ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్వీ పార్టీ ఆధ్వర్యంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడలో ఉన్న చల్ల లింగారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ మేరకు అక్కడ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్ట్ కింద చేసిన అభివృద్ధి పనులలో భాగంగా ఏర్పాటుచేసిన డిజిటల్ క్లాస్ రూమ్స్ ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజన ఏర్పాట్లను పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు.

# రూ.16 లక్షల విలువైన గంజాయి పట్టివేత

విశ్వంభర, మహేశ్వరం: మహేశ్వరం పోలీసు స్టేషన్ పరిధిలో మహేశ్వరం గేట్ వద్ద శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు చేశారు. సోమవారం చేపట్టిన ఈ తనిఖీలో 62.428కిలోల గంజాయి పట్టుకున్నట్లు మహేశ్వరం పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ సునీతా రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం జాతీయ రహదారి మహేశ్వరం గేట్ సమీపంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా వాహనాలు తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన ఓ వాహనాన్ని తనిఖీ చేయడంతో గంజాయి పట్టుకోవడం జరిగిందని, గంజాయి విలువ రూ.16.లక్షల విలువ ఉంటుందని, ఏ3 చిట్టి బాబు, ఏ4 ప్రా ణహిత పరారీలో ఉన్నారన్నారు. మొహమ్మద్ మౌలానా, తోరికొండ, జక్రాన్ పల్లి, మండల్, నిజామాబాదు ఏ2.మహమ్మద్ ముస్తఫా ఉన్నారు. నిందితుల నుంచి వాహనం, రెండు మొబైల్ ఫోన్లు,రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అయతే కానిస్టేబుల్‌లకు రివర్డ్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ. లక్ష్మీకాంత్ రెడ్డి, సీఐ హెచ్.వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, కానిస్టేబుల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన




**విశ్వంభర, సీతఫల్ మండి:** మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో కెరీర్ గైడియన్స్ ప్రోగ్రాం ప్రవీణ్యం లీడ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ, హైదరాబాద్ ఈస్ట్ జోన్ చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శ్యామల హేమ, ఫౌండేషన్ నంబర్స్, ప్రశాంత్, గోపికృష్ణ, సాయికుమార్, భరత్, మురళి కృష్ణ, లిల్లీ కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ



**విశ్వంభర, సంగారెడ్డి:** ఇంటి తాళాలు పగలగొట్టి 15 తులాల బంగారం దొంగతనానికి గురైన సంఘటన రామ చంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామ చంద్రాపురం పోలీసుల కథనం ప్రకారం.. భారతి నగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో నివాసం ఉంటున్న గైక్వాడ్ శ్రీను బొంబే కాలనీలో ఉంటున్న తల్లిదండ్రుల నివాసానికి భార్య అర్చనతో కలిసి శనివారం రాత్రి వెళ్లారు. ఎల్ఐజీ కాలనీ నుంచి తిరిగి ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఎల్ఐజీ కాలనీలో ఇంటికి వెళ్లి చూడగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా తన ఇంట్లో గల బీరువా తాళం పగలగొట్టి 15 తులాల బంగారం గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు తెలిసింది. దీంతో రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న రామచంద్రాపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీంను రంగంలోకి దింపి ఆధారాలను సేకరిస్తున్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలు




**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాలేజీలు ప్రారంభించారు. మహబూబాబాద్ పట్టణంలోని మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ శ్యాంసుందర్, వైద్య, నర్సింగ్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై మృతి

విశ్వంభర, ములుగు: సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై ప్రాణాలు విడిచిన విషాద ఘటన ములుగు జిల్లాలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. వాజేడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రుద్రారపు హరీశ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తు న్నాడు. ఈ క్రమంలోనే ఏటూరు నాగారం మండల పరిధిలోని ముళ్లకట్ట బ్రిడ్జి సమీపంలో ఉన్న ఓ రిసార్ట్ లో హరీశ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ప్రాణాలు విడిచాడు. ములుగు జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ తర్వాత వాజేడు ఎస్ఐ ఆత్మహత్య చేసుకోవడం కలకలం లేపుతుంది, ఉన్నత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి

### మిర్యాలగూడ ఎమ్మెల్యే



**విశ్వంభర, నల్గొండ:** దామరచర్ల మండలంలో మధ్యలో నిలిచిపోయిన కొండ్రపోల్ -కేశవాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఇరిగేషన్ అధికారులు, గ్రామస్థులు, రైతులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ.. నష్ట పోయిన రైతులకు ఎందుకు నష్ట పరిహారం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మరో ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# కేటీఆర్ కాలనీకి దారి ఇవ్వాలని నిరసన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో నివాసముంటున్న కేటీఆర్ కాలనీవాసులకు దారి ఇవ్వాలని మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత రత్న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య ఆధ్వర్యంలో కాలనీవాసులు నిరసన చేపట్టారు. అనంతరం కొండ్రా మల్లయ్య మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కేటీఆర్ కాలనీలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. అసైన్మెంట్ ప్రభుత్వ స్థలంలో కొంతమంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి కరెంటు వసతి తోపాటు నీటి సౌకర్యం, ఇంటి పన్నులు ఉన్నాయన్నారు. అలాగే ఇటీవల ఎమ్మెల్యే భూక్యా మురళిని కలిసి సమస్య వివరించామన్నారు. దీనికి వెంటనే స్పందించిన ఆయన తక్షణ సహాయం కింద విద్యుత్ సదుపాయం కోసం రూ.10లక్షల అందించారని గుర్తు చేశారు.

# అంకిత భావంతో పనిచేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవ చేయాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. కొత్తగా నియామకమైన పోలీస్ కానిస్టేబుల్స్‌కు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. జిల్లా నుంచి 96 సివిల్, 46 ఏఆర్‌లు నియామకం కాగా, 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సలహాలు, సూచనలు అందించారు. పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైందని, ఎన్నో సవాళ్లతో కూడుకుందన్నారు.

మేరకు ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. ఈ ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఆసక్తి ఉన్నవారు మరింత మంచి ఉద్యోగాల కోసం ఉన్నత హోదా కోసం శ్రద్ధగా తమ విశ్రాంతి సమయాన్ని వాడుకొని చదువుకోవాలని మరింత మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్బీ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్ఐలు అనిల్, సోములు, శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో మహిళ మృతదేహం లభ్యం



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరి నదిలో విషాదం నెలకొంది. గోదావరి నదిలోకి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సమ్మక్క(65) గత నెల 27న తన ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు రావడంతో మనస్థాపం చెంది ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా ఎక్కడ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు టేకుమట్ల పీఎస్ లో ఫిర్యాదు చేశారు. అదే రోజు కాళేశ్వరం చేరుకోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు కాళేశ్వరం పోలీసులు భావిస్తున్నారు. కాళేశ్వరం గోదావరి నదిలో మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. తీరంలో ఉన్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులు గోదావరికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా సమ్మక్కగా ధృవీకరించారు. దీంతో కాళేశ్వరం పోలీసులు జాలరుల సహయంతో మృతదేహాన్ని బయటకు తీయగా.. మృతదేహం కుళ్లి ఉండడంతో తీరంలోనే డాక్టర్ పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయిరాం



**విశ్వంభర, వికారాబాద్:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మన్నె సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నె సాయిరాం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతిలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీయడంతోపాటు సమాచార హక్కు చట్టంపై పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

విశ్వంభర V3 NEWS

# ఎన్ని రోజులు ఈ నిర్బంధాలు..ఎంతకాలం ఈ మోసాలు..!

## రేవంత్ సర్కార్‌పై ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజం




విశ్వంభర, హైదరాబాద్ : ఈ ఏడాది కాలంలో రేవంత్ ప్రభుత్వం సత్తా ఏంటో తెలిసిపోయింది.. కేవలం పోలీసులతో పాలన చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్ని రోజులు ఈ నిర్బంధాలు.. ఎంతకాలం ఈ మోసాలు.. అని నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. గురుకులాల్లో స్థితిగతులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కేసీఆర్ హాయాంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో గురుకులాలు అద్భుతంగా తీర్చిదిద్దబడితే రేవంత్ ప్రభుత్వం వాటిని నాశనం చేస్తోంది. కేసీఆర్ హాయాంలో గురుకుల విద్యార్థులు ఎవరెస్టుతో పాటు కిలిమంజారో పర్వతం అధిరోహించారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు.గురుకులాల్లో అధ్వాన్నంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో కమిటీ వేశాం. మా విద్యార్థి విభాగం గురుకులాల్లో సమస్యలు అధ్యయనం చేస్తే రేవంత్ రెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏంటి..? అసెంబ్లీ సమావేశాలున్న నేపథ్యంలో ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడానికే మా బృందాలు పర్యటిస్తున్నాయి. గురుకులాల్లో అన్నీ బాగుంటే రేవంత్ ఈ పర్యటనలు ఎందుకు అడ్డుకుంటున్నారు..? విద్యార్థులను కలిసేందుకు వెళ్లిన మా వాళ్ళను రేవంత్ రెడ్డి ఆపుతున్నారు. విద్యార్థులే రోడ్ల మీదకు వస్తున్నారు.. ఎంత మందిని అడ్డుకుంటావు..? మేము అక్కడికి ధర్నాలు చేయడానికో, తరగతుల బహిష్కరణకో వెళ్లడం లేదు. స్కూల్ పిల్లలకు అన్నం కూడా సరిగా పెట్టలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.గురుకులాల్లో విషాహారానికి బీఆర్ఎస్ కుట్ర అనడానికి సిగ్గుండాలి. పాలన చేతకాకనే బీఆర్ఎస్‌పై నిస్సిగ్గుగా విమర్శలు చేస్తున్నారు. వివిధ శాఖలకు మంత్రులు లేకపోవడం కూడా ప్రభుత్వ వైఫల్యాలకు ప్రధాన కారణం. విద్యా శాఖకు మంత్రి లేకపోవడం ఏంటి..? విద్యా శాఖ కీలకమైందన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదు. విద్యా శాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం దుర్మార్గం. సీఎంకు మంత్రి వర్గ విస్తరణ చేసే దమ్ము లేదు.. కనీసం వేరే మంత్రులకు విద్యా శాఖ అప్పగించాలన్న ఇంగితం సీఎంకు లేదు. కనీసం కోదండరాంకైనా సీఎం విద్యా శాఖను కేటాయించాలి. ఇప్పటికైనా సీఎం రేవంత్ సోయి తెచ్చుకుని పాలన చేయాలని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సూచించారు.

# హెలికాప్టర్ ఇండస్ట్రీలోకి మరింత మంది మహిళా పైలట్లు..

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..!

**ఢిల్లీః** హెలికాప్టర్ పరిశ్రమలోకి మరింత మంది మహిళా పైలట్లు వస్తారని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయాలను నిర్మించలేని, విమానాలు నడపలేని ప్రాంతాలను అనుసంధానించడంలో హెలికాప్టర్లు కీలకం అవుతాయన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే శరవేగంగా భారత పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందుతున్నదన్నారు. దేశీయంగా హెలికాప్టర్ పరిశ్రమను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పైలట్లు సగటున ఐదు శాతం ఉంటే, భారత్ లో 15 శాతం మంది మహిళా పైలట్లు ఉన్నారన్నారు. పౌర విమానయాన రంగంలో మహిళా సాధికారతను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విమానాశ్రయం నిర్మించలేని, వాణిజ్య విమాన సర్వీసులు నడుపలేని ప్రాంతాలను అనుసంధానించడానికి హెలికాప్టర్ పరిశ్రమ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

# రుణమాఫీ కాలేదని రైతుల ధర్నా

## అధికారుల తప్పిదం వల్లేనని ఆగ్రహం.. మహబూబాబాద్ జిల్లాలో నిరసన



**విశ్వంభర, నర్సింహులపేట :** రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట రైతు వేదిక వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రూ.55 వేల నుంచి రూ.2లక్షల లోపు పంటరుణం ఉన్నా తమకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో తమ బ్యాంకు ఖాతాలకు ఇతరుల ఆధార్‌కార్డు నంబర్లు నమోదు చేయడంతో మొదటి విడతలో రుణమాఫీ కాలేదని, అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేకుండాపోయిందని వెల్లడించారు.వ్యవసాయ అధికారులు కావాలనే తమ సెల్ఫీ ఫొటోలు తీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ చేసేవరకు దీక్ష చేపడుతామని కేవీపీఎస్ జిల్లా నాయకుడు మందుల యాకూబ్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్దనాగారం స్టేజీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు, రైతు బొబ్బ అశోక్‌రెడ్డి ఏవో వినయ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగాడు.

# పోరుబాటకు సిద్ధమవుతున్న పాడి రైతులు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పాడి రైతులు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టే అంశంపై పాడి రైతు సంఘాలు చర్చిస్తున్నట్టు స మాచారం.బకాయిల విడుదలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో అసెంబ్లీ లేదా సచివాలయాన్ని ముట్టడించే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. సుమారు రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది.

## కార్తీక మాసోత్సవాల్లో

# అంకిత భావంతో పోలీసుల విధుల నిర్వహణ

## - డీఎస్పీ రామాంజీ నాయక్



**విశ్వంభర, శ్రీశైలంః** ప్రఖ్యాతి గాంచిన శ్రీశైల మహా క్షేత్రానికి కార్తీక మాసంలో దేశం నలుమూలల నుండి వచ్చిన యాత్రికులకు సేవలందించడంలో పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించారని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీ నాయక్ అన్నారు. కార్తీకమాసం ముగిసిన సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోంగార్డు నుండి డీఎస్పీ స్థాయి వరకు సుమారు 400 మంది అధికారులు, సిబ్బంది సమన్వయంతో రేయింబవళ్లు విధులు నిర్వహించినందుకు పేరుపేరున అభినందనలు తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, విజయవాద నుండి వచ్చే రహదారుల వెంట ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారుల సూచనల మేరకు విజువల్ పోలీసింగ్ ప్రణాళికలతో మొబైల్ పెట్రోలింగ్ చేసి సత్ఫలితాలను సాధించడం హర్షనీయమని అన్నారు.దేవస్థానం అధికారులు సహా సెక్యూరిటీ విభాగం సీసీ కంట్రోల్ ద్వారా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సున్నిత ప్రాంతాలను పర్యవేక్షిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మాసోత్సవాలు ప్రశాంతంగా జరిపించగలిగినట్లు రామాంజీ నాయక్ తెలిపారు. అదే విధంగా స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు పోలీస్ శాఖతోపాటు ఇతర అధికారిక వీఐపీ ప్రోటోకాల్లో వచ్చిన అతిధులకు ఆలయ సంప్రదాయం ప్రకారం దర్శన భాగ్యం కల్పించడంలో సీఐ ప్రసాదరావు సేవలను ప్రశంసించారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు మెరుగైన పోలీస్ సేవలందిస్తూనే ఉంటామని ఆయన అన్నారు.



# మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్.. వచ్చే నెల 1 వరకు ఆంక్షలు

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించింది. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు, ధర్నాలు జరుపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు.

### నిర్బంధం దిశగా..

స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణను నిర్బంధంలోకి నెడుతున్నది. అధికారంలోకి రాగానే ప్రజాభవన్ వద్ద కంచెలు కూల్చి, ఇకపై ఆంక్షలు ఉండవంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తాజాగా తన అసలు రంగును బయటపెట్టింది. తమ అసమర్థ పాలనను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేయగా, జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను విధిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేయగా, అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి.

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

## : రామ్మోహన్ నాయుడు భరోసా

**విశ్వంభర, శ్రీకాకుళం:** పొట్ట కూటి కోసం విదేశాలకు వెళ్లి చిక్కుకున్న వలస కార్మికులకు అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భరోసా ఇచ్చారు. బాధితులందర్నీ స్వదేశానికి తీసుకు వచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాంతో పాటు ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన దాదాపు 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి అక్కడ చిక్కుకున్న విషయం తెలిసిందే. రెండు నెలలు పని చేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం, గత నాలుగు రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోతున్నారు.బాధిత కుటుంబాల ద్వారా సమస్యను తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్.. ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. బాధిత కార్మికులతో సోమవారం మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలిసి ఒప్పిస్తానని తెలిపారు. అలాగే, భారత ఎంబసీ కార్యాలయానికి సమస్యను చేరవేసి.. ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. కేంద్రమంత్రి భరోసా ఇవ్వడంతో తమకు ఎంతో ఉపశమనం లభించిందని బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# స్మార్ట్ ఫోన్లు - సైబర్ నేరాలు



**విశ్వంభర, రామన్నపేట:** స్మార్ట్ ఫోన్ ప్రపంచాన్ని అరచేతిలో చూపిస్తుంది అనేది నిత్య సత్యమైంది. ప్రజల అవసరాలు, అభిరుచులు వివిధ రకాల సమాచారం కోసం వెబ్ సైట్స్ అప్స్ ఉపయోగించడం సర్వసాధారణం అయ్యింది. కానీ ఇలాంటి సమయాల్లోనే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో వీడియో, ఆడియో ప్రకటణలు వినియోగదారుల కోసం వ్యక్తిగత సమాచారం ఆధారంగా, ఇష్టాలతో సంబంధం లేకుండా, ప్రకటనలు ఇస్తున్నారు. వీటిని ఆసరాగా చేసుకుని ఆన్లైన్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలు ప్రతినిత్యం అప్డేట్ అయి స్మార్ట్ ఫోన్స్, లాప్ టాప్, కంప్యూటర్ ల ఆధారంగా బ్యాంకు లావాదేవీలు, ఈకేవైసీ అప్డేట్స్, వివిధ రకాల వెబ్ సైట్స్ ఉపయోగించడానికి ఇంటర్నెట్ సేవలపై ఆధారపడవలసి వస్తుంది, తద్వారా సైబర్ నేరాల బారిన పడవలసి వస్తుంది. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు ఈమెయిల్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా నేరాలు, మొబైల్ యాప్ సంబందిత నేరాలు, వ్యాపార సంబందిత రాజీ అయ్యే నేరాలు, ర్యాంసన్ వేర్, నెట్ బ్యాంకింగ్, ఏటీఎం ఫ్రాడ్స్, ఫేక్ కాల్స్, ఇన్సూరెన్స్ ఫ్రాడ్, లాటరీ స్కాం, చీటింగ్ స్కాం, ఆన్లైన్ ట్రాన్సాక్షన్ స్కాం, ఇలా పలు రకాలుగా హ్యాకింగ్ చేసి ఆర్థిక సంబంధమైన లావాదేవీల ద్వారా సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారు. కావున వినియోగదారులు, ప్రజలు చైతన్యంతో ఆలోచించి ప్రభుత్వ గుర్తింపు గల నెట్వర్క్ తోటే, వెబ్ సైటును ఓపెన్ చేసి ఉపయోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా అనవసరమైన కాల్స్ ను, మెసేజెస్ ను గాని, ఓపెన్ చేయడం మానుకోగలరు. సంబంధం లేని వ్యక్తులు, సంస్థలు గాని చేసి ఓటీపీలు చెప్పమనడం, ఓపెన్ చేయండి అనడం పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. లింక్స్ ఓపెన్ చేయడం, ఓటీపీలు చెప్పడం ద్వారా ఫిషింగ్ సోషల్ ఆన్లైన్ కం స్కాం, సోషల్ ఇంజనీరింగ్ కాల్స్ చేయడం జరుగుతుంది. సైబర్ నేరగాళ్లు మన సమాచారాన్ని, వ్యక్తిగత అంశాలను ఫేస్బుక్ ద్వారా, ఇన్స్టాగ్రామ్ ద్వారా తీసుకోవడం జరుగుతుంది. ఇట్టి పాస్ వర్డ్స్ తరచూ మారుస్తూ ఉండాలి. సైబర్ నేరగాళ్లు ప్రొఫైల్స్ చూసి తప్పుడు సమాచారం మెయిల్స్ పంపడం, బ్యాంకు ఖాతాల సమాచారం, ఏటీఎం సమాచారం లక్షలు కాజేసిన సందర్భాలు కోకొల్లలు. ప్రజల భద్రతకు మరియు జాతీయ ఆర్థిక భద్రతకు ముప్పు కలిగిస్తాయి. వ్యక్తిగతమైనటువంటి సమాచారాన్ని ఒక ప్లాన్ ప్రకారం హ్యాక్ చేసి, నువ్వు వ్యాప్తి చేసి, సాఫ్ట్వేర్ పైరసీ, నకిలీ బ్యాంకు కాల్స్, సైబర్ బెదిరింపుల ద్వారా, ముఖ్యంగా మహిళలైతే వారి చిత్రాలను మార్ఫింగ్ చేసి అశ్లీలంగా చూపించి, బెదిరింపులకు పాల్పడతారు. మహిళలు యాప్స్ లోనూ వ్యక్తిగతమైన సమాచారం ఫోటోలను పోస్ట్ చేయకూడదు. సైబర్ నేరాల బారిన పడకూడదు అంటే ముఖ్యంగా అప్డేట్ సాఫ్ట్వేర్ యూస్ చేయాలి, అంటీ వైరస్ డివైసెస్ ఉపయోగించాలి, ఓటీపీను ఎవరితో షేర్ చేయకూడదు, అనుమతి ఉన్న కంపెనీల వెబ్సైట్స్ ఓపెన్ చేయాలి. చాలా నమ్మకమైన పాస్వర్డ్ పెట్టుకోవాలి. తరచూ వాటిని మారుస్తుండాలి. వర్చువల్ ప్రైవేట్ నెట్వర్క్ వాడేటప్పుడు వ్యక్తిగత సమాచారం జాగ్రత్తగా ఉంచుకోవాలి. పలు రకాల ప్రదేశాల్లో సంస్థల్లో నెట్వర్క్ యూస్ చేసినప్పుడు పాస్వర్డ్స్ మార్చుకోవాలి. ప్రభుత్వం ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం ఆర్థిక నేరగాళ్లకు, సైబర్ క్రైమ్ నెరగాళ్లకు శిక్షలు విధిస్తున్నప్పటికీ, ప్రజలు చైతన్యవంతంగా ఆలోచించి, స్మార్ట్ ఫోన్స్ వాడేటప్పుడు మెసేజ్ లు వచ్చిన కాల్స్ వచ్చిన ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం అన్నిటికంటే ఉత్తమం. ఏదైనా అనుమానం కలిగితే పోలీస్ శాఖ వారిని, బ్యాంక్ అధికారులను కూడా సంప్రదించడం ఉత్తమం. స్మార్ట్ ఫోన్ అనేది ప్రపంచాన్ని ఎంత దగ్గరకు చేర్చిందో, ప్రమాదాన్ని కూడా అదే స్థాయిలో తీసుకువచ్చింది. వినియోగించడం తప్పనప్పుడు జాగ్రత్తగా ఉండడం అవసరం. లేని పక్షంలో ఆర్థికంగా నష్టపోయి, వ్యవస్థ మీద దెబ్బ పడే అవకాశం ఉందని న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారులు కూనూరు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# నటి శోభిత ఆత్మహత్య కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** కన్నడ సీరియల్ నటి శోభిత ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తులో భార్యాభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని గుర్తించారు. మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుందా?ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై దృష్టిసారించారు. శోభిత భర్త సుధీర్‌రెడ్డితో పాటు ఇంటి చుట్టుపక్కల వాళ్ల స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఆమె ఇంట్లో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ''ఎవ్రీథింగ్ పర్ఫెక్ట్.. చావాలనుకుంటే యూ కెన్ డూ ఇట్'' అని రాసి ఉన్నట్లు తెలిపారు.

బెంగుళూరు మ్యాట్రిమోనిలో శోభిత ప్రొఫైల్ చూసి సుధీర్ పెళ్లి ప్రపోజల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. పెళ్లి తర్వాత ఆమె సీరియళ్లలో నటించడం మానేశారు. శోభిత చివరిసారి ఎవరెవరితో మాట్లాడిందనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకువెళ్లనున్నారు.

శోభితను కన్నబిడ్డలా చూసుకున్నాం: మామ బుచ్చిరెడ్డి

కన్నడ సీరియల్ నటి శోభితను కన్నబిడ్డలా చూసుకున్నామని ఆమె మామ బుచ్చిరెడ్డి తెలిపారు. శోభిత కూడా తమ అందరిలో బాగా కలిసిపోయిందన్నారు. ఆస్పత్రి వద్ద బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ''పెళ్లి అయ్యేంత వరకు ఆమె సెలబ్రిటీ అని మాకు తెలియదు. నా కుమారుడు సుధీర్ రెడ్డి, కోడలు శోభిత అన్యోన్యంగా ఉండేవారు. వారిద్దరి మధ్య ఎప్పుడూ ఎలాంటి గొడవల్లేవు. ఆమె మృతి మా కుమారుడితో పాటు కుటుంబానికి తీరని లోటు. భార్యాభర్తలిద్దరూ ఇటీవలే గోవా వెళ్లొచ్చి.. సంతోషంగా ఉంటున్నారు. మా అబ్బాయి ఆమె అభిరుచికి అనుగుణంగా చక్కగా ప్రోత్సహించేవాడు. ఏ విషయంలోనూ ఆమె నిర్ణయాలను తిరస్కరించలేదు. దయచేసి ఎవరూ అపార్థం చేసుకోవద్దు'' అన్నారు.

శోభిత అంత్యక్రియలు ఇక్కడే తెలంగాణ సంప్రదాయాల ప్రకారం చేస్తామని వాళ్ళ కుటుంబ సభ్యుల్ని అడిగాం. బెంగళూరులోనే తన అంత్యక్రియలు జరగాలని శోభిత కోరిక అని వారు చెప్పారు. వారి మనస్సు నొప్పించకూడదని ఆ నిర్ణయాన్ని స్వాగతించాం. వారు మాపై ఎలాంటి అభియోగాలు మోపలేదు. అంత్యక్రియలకు బెంగళూరు రావాలని చెప్పారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం'' అన్నారు.

# కూరగాయల వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ.. ఆరుగురి దుర్మరణం

విశ్వంభర, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజి వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందారు. హైదరాబాద్ బీజాపుర్ రహదారి పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా.. వారిపైకి లారీ దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దూసుకొస్తున్న లారీని చూసి అక్కడి జనమంతా భయంతో పరుగులు తీశారు. వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీకొట్టి ఆగింది. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్రగాయాలు పాలవ్వడంతో అతడిని బయటకు తీసి చికిత్సకోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. లారీ హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వికారాబాద్ వస్తున్న క్రమంలో అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా పేర్కొన్నారు.ఈ ఘటనతో హైదరాబాద్ బీజాపుర్ రహదారిపై భీతావహ వాతావరణం నెలకొంది. లారీ సృష్టించిన బీభత్సంలో మృతులను రాములు (ఆలూరు), ప్రేమ్ (ఆలూరు), సుజాత (ఖానాపూర్)గా గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జేసీబీతో పక్కకు తొలగించారు. ఘటనా స్థలానికి కి.మీల దూరంలో నిన్న కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొని బీడీఎల్ ఉద్యోగి దంపతులు నిన్న దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

రంగారెడ్డి జిల్లాలో లారీ బీభత్సం సృష్టించిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.



## కొత్త బ్రిడ్జి నిర్మాణమైనా పాత బ్రిడ్జికి మరమ్మతులు ఎందుకు

**విశ్వంభర, ఆమనగల్లు :** మండల కేంద్రంలో ఆమనగల్లు నుంచి తలకొండపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. రోడ్డు విస్తరణకు ప్రభుత్వం 37 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. అందులో భాగంగా బస్టాండ్ సమీపంలో చెరువు కట్ట వద్ద బ్రిడ్జి నిర్మాణం కొరకు నాలుగు కోట్ల వరకు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. బ్రిడ్జిని రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న పాత బ్రిడ్జిని ఆనుకొని రావడానికి ఒక బ్రిడ్జి పోవడానికి ఒక బ్రిడ్జి నిర్మాణం చేశారు. దాదాపు ఒక బ్రిడ్జి కి రెండు కోట్ల దాకా ఖర్చయిందని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. రెండు వంతెనలు నిర్మించిన తర్వాత పాత వంతెనకు కూడా మరమ్మత్తులు చేస్తున్నారు, కారణం ఏంటో తెలియదు లోగోట్టు పెరుమాళ్ళ ఎరుక అన్నచందంగా పరిస్థితులు కనబడుతున్నాయి. చెరువు కట్టకు వెళ్లే రహదారిలో ఇరువైపులా ఉన్న దుకాణాలను చిన్నచిన్న వ్యాపారస్తుల డబ్బులను, ఇండ్లను సైతం రహదారి విస్తరణలో భాగంగా తొలగించాలని గుత్తేదారు సూచించారు, కానీ బ్రిడ్జికి అడ్డంగా ఉన్న బహుళ అంతస్తుల భవనానికి మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చిన తొలగించడం లేదు. రోడ్డు పక్కన ఉన్న అందరికీ సమన్యాయం జరగాలని మా షాపులను తొలగించి వాటిని మాత్రం ముట్టుకోవడం లేదని అన్నారు. గుత్తేదారు అధికారులు ఇకనైనా పట్టించుకోని కోట్ల నిధుల తో నిర్మించిన వంతెన ప్రారంభమయ్యేటట్లు పాత ను ఎందుకు మరమ్మత్తు చేస్తున్నారో తెలుపాలని కోరారు. కోట్ల రూపాయల ప్రజాధనం వ్యర్థం కాకుండా చూడాలని కోరుతున్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



**విశ్వంభర, రంగారెడ్డి :** షాద్ నగర్ మున్సిపాలిటీ 19 వార్డ్ పటేల్ రోడ్డుకు చెందిన సక్కుబాయికి సీఎం రిలీఫ్ ఫండ్ 60,000 చెక్ ను పట్టణ అధ్యక్షులు కొంకాళ్ళ చెన్నయ్య అగ్గునూరి బస్వం అప్ప షార్ఫొద్దీన్, ఫయాజ్, మన్నే రవి, నీరటి వాసు, రాజమోని రాజు, గుగ్గిళ్ల రవి రాజమోని జగదీష్ తదితరులు అందించారు.

## శివ మహాపడిపూజ కార్యక్రమంలోఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని శ్రీమల్లికార్జున భక్తసమాజం ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శివ గురుస్వామి, ముద్రగౌని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శివ మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పరమేశ్వరునికి మహా రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి ,బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారాసా పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ నేత గుత్తి బాలస్వామి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డా. పత్య నాయక్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ యడ్మా సత్యం అనుచరులు గుత్తి బాలస్వామి జన్మదిన వేడుకలు ఆమనగల్లు లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, సీనియర్ నాయకులు ఉప్పల రాములు, బిఆర్ఎస్ మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డేమోని శివకుమార్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ లండం యాదయ్య, వరికుప్పల గణేష్,దేవేందర్,మహేష్, రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఆర్కే పురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 700 మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రొద్దటూరు శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్ గుప్తా తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మాసం అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ చేపట్టడానికి సహకరించుతున్న దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 69 మంది దాతలు అన్న ప్రసాదవితరణకు సహకరించినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదాన వితరణ

**విశ్వంభర, షాద్ నగర్ :** పట్టణంలోని శ్రీ శివ మారుతి అయ్యప్ప గీతా మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల అనంతరం దాత భీమిడి అశోక్ కుమార్ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలుచేపట్టారు. ఈ కార్యక్రమానికి అన్నదాత కుటుంబసభ్యులు శ్రేయాస్ రెడ్డి, భవనం పూర్ణచ్చందర్ స్వామి, ప్రహ్లాద్ రెడ్డి స్వామి, వీర రెడ్డి స్వామి, విజయ సేన రెడ్డి, శివ మారుతి గీతా అయ్యప్ప మందిరం అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ స్వామి, కోశాధికారి దాస కృష్ణయ్య తదితర అయ్యప్ప భక్తులు, స్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టారు. శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దర్శనానికి ప్రయాణించేలా గిరీష్ సతీష్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాములు జగదీష్ స్వామి, భరత్ కుమార్ స్వామి, అరుణ్ స్వామి, అభిలాష్ స్వామి,నాగరాజు స్వామి,శ్రీనివాస్ స్వామి తదితరులు శబరిమలకు ప్రయాణమయ్యారు.

## ఘనంగా రాఘవభారతి గ్రంథాలయ మూడవ వార్షికోత్సవం



**విశ్వంభర,ఆత్మకూర్(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం రాఘవాపురం గ్రామంలో రాఘవభారతి గ్రంథాలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గాయకురాలు నిర్మల హాజరైయారు. రాఘవభారతి గ్రంథాలయ అధ్యక్షులు వంగాల రమేష్ మాట్లాడుతూ పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్యుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకొని గ్రామ యువకులు గ్రామ ప్రజల సహకారంతో మూడు సంవత్సరాలుగా విజయవంతంగా గ్రంథాలయం నిర్వహిస్తూ అనేక రకాల టాలెంట్ టెస్ట్ లు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుద్యోగులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమయ్యే కాంపిటేటివ్ పుస్తకాలను సేకరిస్తూ ముందు తరాలకు విజ్ఞానాన్ని అందించే విధంగా గ్రంథాలయానికి తోడ్పడుతున్న దాతలకు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న రాఘవపురం యువతకు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన వారికి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాఘవ భారతి గ్రంథాలయం కమిటీ ఉపాధ్యక్షులు మూషం సత్యనారాయణ వంగాల శ్రవణ్, ప్రధాన కార్యదర్శి కాటం నరేశ్, సహాయ కార్యదర్శి కలకోటి గోపయ్య చారి, కాటం మహేష్, కోశాధికారి బంటు తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

## టగ్ ఆఫ్ వార్ ఉపాధ్యక్షుడిగా మోత్కూర్ యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నిక

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** హైదరాబాద్ లాల్ బహద్దూర్ స్టేడియంలో ఆదివారం రోజున రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలోఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ పవన్ కుమార్, టగ్ ఆఫ్ వార్ ఫెడరేషన్ అఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ మదన్ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా మోత్కూర్ యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు తెలిపారు. మోత్కూర్ యాదయ్య ఎంపిక పట్ల జిల్లా లయన్స్ క్లబ్ చైర్మన్ డా. లక్ష్మి నరసింహా రెడ్డి , సెక్రెడ్ హార్ట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎం.తానయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నాగయ్య ,జిల్లా టగ్ అఫ్ వార్ అసోసియేషన్ మేంబర్స్ క్రీడా సంఘాల మెంబెర్స్,తోటి పాఠశాల ఉపాధ్యాయల బృందం అభినందించారు.



## కేశని సత్యమ్మ కుటుంబానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**విశ్వంభర, కడ్తాల్ :** కేశని సత్యమ్మ కుటుంబానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ . 5, వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా అందజేసినట్లు వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా కేశని సత్యమ్మ మృతి చెందారని ఆమె ఇంటికి వెళ్లి సత్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సత్యమ్మ కుటుంబానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జరుపుల దశరథ్ నాయక్, మంగలపల్లి నరసింహ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాదయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ వార్డు మెంబర్ మహేష్, గ్రామస్తులు దశరథం, జంగయ్య, వెంకటేష్, శ్రీను, శ్రీరామ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ రూ. 51 వేలు ఆర్థిక సాయం

**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలో భగత్ సింగ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ 51000/వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. సంఘం ఆధ్వర్యంలో త్వరలో నిర్మాణం కాబోతున్న భవనము, భవన ఆవరణలో భగత్ సింగ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గాను 51000 రూపాయలను మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ కమిటీ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ ఐక్యవేదిక అధ్యక్షులు ఎర్రోళ్ళ రాఘవేందర్ కానుగుల లక్ష్మయ్య సత్యం శివ మహేందర్ జంగయ్య, వెంకటేష్, శ్రీను మురళి, శంకరయ్య, మహేష్, నరసింహ, మహేష్, లాయక్ అలీ, మంగళపల్లి నరసింహ, మధు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజక వర్గం అమీన్ పూర్ మండల పరిధిలో పటాన్ చేరు ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మెరుపు దాడులలో మద్యం విక్రయిస్తున్న ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేసి అమీన్ పూర్ తహసీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసారు. వారి వద్ద నుండి 3 స్కూటీ లు 07.74 లీటర్ల మద్యం ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పలు గంజాయి కేసులో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను మంగళ వారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తారు. ఆసక్తి కల వారు పటాన్ చేరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ లో సంప్రదించాలని ఎక్సైజ్ సీఐ వేల్లడించారు.

## సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే మరో ప్రజా పోరాటం తప్పదు



**విశ్వంభర, రామన్నపేట:** లగచర్ల , దిలావర్పూర్ మాదిరిగానే, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను పూర్తి స్థాయిలో ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మరో ప్రజా పోరాటం తప్పదని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండి రెహాన్ లు తెలిపారు. అంబుజా పరిశ్రమను నిరసిస్తూ స్థానిక రామన్నపేట సుభాష్ సెంటర్లో అఖిలపక్ష పార్టీలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా ముక్తకంఠంగా వ్యతిరేకించడం జరిగింది. కానీ పరిశ్రమ ఉపసంహరించుకున్నట్టు ప్రభుత్వం లేదా కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి ప్రకటన చేయలేదని, సిమెంటు కాలుష్య పరిశ్రమ పెడితే, ప్రజారోగ్యం దెబ్బతింటుందని, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లాజిస్టిక్ పార్క్ అనే పేరుతో పనులు ప్రారంభిస్తున్నారని పరిశ్రమ ఉపసంహరించుకునే దాకా ఎలాంటి పనులు చేయొద్దని అన్నారు.

## ప్రేమ వివాహం చేసుకున్నందుకు హత్య

### మృతురాలు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోలు గ్రామానికి చెందిన నాగమణిని సొంత తమ్ముడే నరికి చంపాడు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కొంగర మాసయ్య కూతురు నాగమణి (28) హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తుంది. గత 15 రోజుల క్రితం నాగమణి ఓ అబ్బాయిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. ఊర్లో తమ పరువు తీసింది అంటూ తమ్ముడు పరమేష్ అక్కను చంపేందుకు పక్క ప్లాన్ చేశాడు. ఈ క్రమంలోనే రోజులాగే విధులకు హాజరయ్యేందుకు స్టేషన్ కు స్కూటీపై వెళ్తున్న నాగమణిని రాయపోలు మన్నెగూడ సమీపంలో దారికాచి కారుతో బలంగా ఢీకొట్టాడు. అనంతరం కింద పడిపోయిన అక్కను దారుణంగా నరికి చంపిన పరమేష్ నేరుగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో లొంగి పోయాడు.

## పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

### ఎమ్మెల్యే కసిరెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి :** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పేదలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నవారు ఎమ్మెల్యేకు దరఖాస్తు చేయడంతో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను తన నివాసంలో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, సాయిరెడ్డి, వసుపుల జంగయ్య, తల్లోజు రామకృష్ణ, రవీందర్ నాయక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## మాస్టర్ కారింగు రవికి ఘనంగా సన్మానం

### జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా శిక్షకుడు




**విశ్వంభర, చండూర్ :** సన్ పవర్ మార్షల్ ఆర్ట్స్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో 23 వ సన్ పవర్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థుల స్కూల్ యాజమాన్యాలు జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా కరాటే శిక్షకుడు మాస్టర్ కారింగు రవి ని, విజేతలకు ఆయా స్కూల్ యాజమాన్యాలు ఘనంగా సన్మానించారు. గాంధీజీ, గీత, కేజీబీవి, మరియానికేతన్, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులు 6గురు గోల్డ్ మెడల్స్ ఐతరాజు జశ్వంత్, సంకోజు మణిదీప్, కారింగు మోక్షలక్ష్మి, కారింగు అభిరామ్, జన ఓమ్, కావలి శశాంక్ పొందారు. 9మంది సిల్వర్ కారింగు అనురూప్, సంకోజు సాయి ప్రణయ్, నక్కపోతు శృతి, దోమలపల్లి వైష్ణవి, దోమల పల్లి క్రిష్, యశ్వంత్, బీమనపల్లి వీణ లకు సాధించారు. గెలుపొందిన విజేతలకు మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. మాస్టర్ రవి మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులకు మరింతగా శిక్షణ అందించి రాష్ట్ర , జాతీయ స్థాయిలో తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## హెచ్ఐవి రహిత జిల్లాగా నిర్మించడంలో

# యువత పాత్ర కీలకం

### అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్



**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాను హెచ్.ఐ.వి.రహిత జిల్లాగా నిర్మించడంలో యువత పాత్ర కీలకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మహబూబాద్ లెనిన్ వత్సల్ టోప్పో పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నుండి ఐయంఏ హాల్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన అనంతరం ఐ.యం.ఏ హాల్ జరిగిన కార్యమంలో ఆయన మాట్లాడుతూ హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులు అందరూ మందులు క్రమం తప్పకుండా వాడుతూ, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ఆత్మస్థైర్యంతో అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు.అంతే కాకుండా విద్యార్థులు, అన్నీ శాఖల సమన్వయంతో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఈ వ్యాధి నివారణ లో తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ వైద్య ఆరోగ్య శాఖ పక్షాన నిర్వహిస్తున్న కార్యక్రమాల పైన వివరించారు. హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మందులు క్రమం తప్పకుండా తీసుకొని ఏ.ఆర్.టి. సిబ్బందిచే సలహాలను తీసుకొని జీవన ప్రమాణాన్ని పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీ సురేశ్ గారు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకన్న, ఆర్ యం ఓ డాక్టర్ జగదీశ్వర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్ కుమార్,డాక్టర్ శ్రవణ్ కుమార్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీమతి లీల, ఏ ఆర్ టి సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సురేందర్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఎయిడ్స్ ప్రాజెక్టు సి యెస్ ఓ సారయ్య, ఎస్ ఎస్ కె రమేష్ సర్వోదయ యూత్ యన్ జి ఓ శాంతారాజ్, విహన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు, ఆరోగ్య విద్యా బోదకులు కె తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలకు కేసముద్రం స్టేషన్ విద్యార్థి ఎంపిక



**విశ్వంభర, మహబూబాబాద్ :** ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించినటువంటి వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో 9వ తరగతి విద్యార్థిని మహమ్మద్ ఆఫ్రా మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం రోజున స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశం మీద జిల్లా స్థాయిలో నిర్వహించినటువంటి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి మహబూబా జిల్లా డీఈఓ చేతుల మీదుగా బహుమతిని పొందింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల రాజు, విద్యార్థినిని, గైడ్ టీచర్ ని అభినందిస్తూ రేపు హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం రామచంద్రపురం పట్టణంలో గురు స్వామి చిన్నమైల్ మల్లికార్జున రెడ్డి, చిన్నమైల్ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి రెడ్డి, గురు స్వామి ఉమామహేశ్వర స్వామి సమక్షంలో శబరగరీసా అయ్యప్ప స్వామి మహా పడిపూజ శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో గోదావరి అంజిరెడ్డి , కుటుంబ సభ్యులు హరిహరపుత్ర అయ్యప్ప స్వామికి అభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించి 18 మెట్ల పడి పూజ చేపట్టారు. పడి పూజా కార్యక్రమంలో భజన మండలి మన్నె ప్రవీణ్ కుమార్, గుడివాడ బ్రదర్స్, కపిల్ మద్దూరి వారి భక్తి గీతాలతో అయ్యప్ప స్వా ములను అలరింపజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పడి పూజకు పెద్ద మైల్ గోపాల్ రెడ్డి, శంకర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు దేశ్ పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలకూరు రాజశేఖర్ రెడ్డి, రాములు, ఈర్ల రాజు, గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సునీత లక్ష్మారెడ్డి, శంకర్ యాదవ్ , టిఆర్ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, మునిపంపుల గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ధర్మ సమాజ పార్టీ మండల నాయకులు పరిశీలించారు. రామన్నపేట మండలంలో ఉన్న 24 గ్రామ పంచాయతీలకు ఉన్న ఏకైక పిహెచ్సి కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి రోగులకు వైద్యాన్ని అందించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు బందెల అశోక్ కోరారు. అలాగే నర్సు పోస్టు ఖాళీగా ఉందని గుర్తించడం జరిగింది. ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, రామన్నపేట మండల కేంద్రంలో మొత్తం కూడా కేవలం 9 మాత్రమే సబ్ సెంటర్స్ ఉన్నాయి. ఈ సబ్ సెంటర్స్ లో కేవలం 51 మంది మాత్రమే ఆశ వర్కర్లు పనిచేస్తున్నారు. మండల కేంద్రంలో మొత్తం జనాభాకు కేవలం 51 మంది ఆశ వర్కర్లు ఉండడం వలన పూర్తిస్థాయిలో గ్రామాల్లో వైద్యం ఉండకపోవడం జరుగుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లను పెంచాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు బందెల అశోక్ కోరారు.

## ఉప రాష్ట్రపతితో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**విశ్వంభర, హనుమకొండ :** భారత రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ తో సోమవారం సమావేశమయ్యారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న సందర్భంగా రాజ్యసభలోని ఛైర్మన్ ఛాంబర్ కు ఎంపీ రవిచంద్ర ఉదయం వెళ్లి ధనఖర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## మానవత్వం చాటుకున్న కలెక్టర్

**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** సోమవారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటనకు వెళ్లి జిల్లా పాలన అధికారులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ అదనపు కలెక్టర్ నగేష్ ,మెదక్ జిల్లా తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో మెదక్ మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన రాజు చిన్న శంకరం పేట మండల కేంద్రంలో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహించుకుని బైక్ పై ప్రయాణం చేస్తుండగా బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడం జరిగింది. అదే సమయంలో మెదక్ వైపు వస్తున్న జిల్లా పాలన అధికారులు ప్రమాద దృశ్యాన్ని చూసి వాహనాలను ఆపి హుటాహుటిన ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిమిత్తం వైద్యాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు . జిల్లా పాలనాధికారులు చూపించిన మానవతా దృక్పథానికి ప్రజలు హర్షిస్తున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలి భర్త మృతి ఆర్థిక సహాయం అందజేత



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ రామన్నపేట మండల మహిళా కార్యదర్శి బొజ్జ కోటమ్మ భర్త శ్రావణ్ కుమార్ అకాల మృతి చెందారు. శ్రవణ్ అకాల మృతికి చింతిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, బీ.ఆర్.ఎస్ గ్రామ శాఖ సభ్యులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, తమ వంతు సాయంగా 21వేల రూపాయల విరాళం అందజేసారు. అలాగే మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, తమ వంతు సాయంగా రూ.5,000/ ఆర్థిక సహకారాన్ని వారి కుటుంబ సభ్యులకు జనంపల్లి మాజీ ఎంపీటీసీ వేమవరపు సుధీర్ బాబు అందించారు.

## డబుల్ బెడ్ రూమ్ లోకి చేరే గడువును మరో మూడు నెలలకు పొడగించాలి

### మౌలిక సదుపాయాలు సమకూర్చాలి

### జిహెచ్ఎంసి అధికారులకు విన్నవించుకున్న కొల్లూర్ డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు




**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ప్రభుత్వం కల్పించుకొని అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ లకు చేరే గడువు ను మరో మూడు నెలలకు పొడిగించాలని లబ్ధిదారులు ఆదివారం మధ్యాహ్నం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూరులో గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం హాయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లు 117 బ్లాకులను 1489.29 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు ఒకే చోట ఏకంగా 15,660 ఇండ్ల నిర్మాణాన్ని టిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అందించారని కానీ అందులో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వాటన్నిటిని వినియోగదారుల స్వయంగా డబ్బులు కూడా పెట్టుకుని రిపేర్లు చేయిస్తున్నారని అది పేదవారికి భారంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో జిహెచ్ఎంసి అధికారులు డిసెంబర్ 15 వరకు డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు గడువులోపు చేరకపోతే పట్టాలు రద్దు చేస్తామని జిహెచ్ఎంసి అధికారులు వేరే వారికి డబల్ బెడ్ రూమ్ లను కేటాయిస్తామని హెచ్చరికలు జారీ చేసారని ఆవేదన వ్యక్తం చేసారు.

## భీమలింగం కాలువ సాధన కోసం పోరాడిన అంజిరెడ్డి





సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** అమరజీవి గుర్రం యాదగిరి రెడ్డి నాయకత్వంతో భీమలింగం సాధన కోసం సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించారని లింగరాజుపల్లి గ్రామాన్ని సస్య శ్యామలంగా నీరు అందించుటకు ఎంతో కృషి చేసినారు.సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు కామ్రేడ్ ఎడ్ల అంజిరెడ్డి సంతాప సభ సందర్భంగా అన్నారు. ఏ ఆర్, కె ఆర్ నాయకత్వంలో అడ్డగూడూరు భూ పోరాటంలో పాల్గొని నిరుపేదలకు భూములు పంపిణీ చేశారని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం లింగరాజుపల్లి గ్రామంలో ఇండ్లు ఇప్పించారని అన్నారు. అంజిరెడ్డి గ్రామ సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అదేవిధంగా అంజిరెడ్డి సింగిల్ విండో బ్యాంక్ వైస్ చైర్మన్ గా ఇక్కడి రైతులకి అనేక పంట రుణాలు ఇప్పించారని ఈ సందర్భంగా అన్నారు. ఈ సంతాప సభకు అధ్యక్షులుగా బుచ్చిరెడ్డి వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, నాయకులు లక్ష్మీ నరసయ్య, జిల్లా అధ్యక్షులు మహేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న : బీఆర్ఎస్ నాయకులు

**విశ్వంభర.మహేశ్వరం :** మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాలమేరకు మహేశ్వరం గ్రామంలోని బి ఆర్ ఎస్ నాయకులూ ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తనిఖీ చేసారు. విద్యార్థిలతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంటుంది నాణ్యతగ పెడుతున్నారా లేదా తెలుసుకున్నారు. రోజువారీగా ఆహారం మార్చి అందిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయుల్ని కూడా ప్రశ్నించారు. విద్యార్థులతో సమానంగా భోజనం చేస్తూ మాట్లాడుతూ మీకు ఎటువంటి ఇబందులు కలిగిన అండగా ఎల్లవేళలా మేము ఉంటాము అని విద్యార్థులకు ధైర్యాన్ని ఇచ్చారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో భోజనశాలను వినియోగించకుండా నేలపైనే భోజనం చేయడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులూ కర్రోళ్ల చంద్రయ్య. ఎక్స్ వైస్ ఎంపీపీ ముణగపాటి స్వప్ననవీన్.మాజీ సర్పంచ్ ప్రియాంక రాజేష్.మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులూ పాల్గొన్నారు.



## బయో డీజిల్ కంపెనీని సందర్శించిన సిపిఐ పార్టీ నాయకులు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గత కొద్దీ రోజుల నుండి వస్తున్న బయో డీజిల్ దుర్వాసనను అరికట్టాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కంపెనీని సందర్శించి అనంతరం యాజమాన్యానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలి ద్వారా వచ్చే బూడిద ఇండ్ల మీద పడి గ్రామ ప్రజలంతా చర్మ దురదలతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిని ఆరికట్టేలా చూడాలని పేర్కొన్నారు. రాత్రిపూట వచ్చే ఈ వాసనతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తగు జాగ్రత్తలు తీసుకొని గ్రామ ప్రజలకు సహకరించాలని కోరారు. కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు ఆరోగ్య సమస్యలు జరిగినచో కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బచ్చన గోని గాలయ్య, దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, విరమళ్ళ యాదయ్య, పల్లె మల్లారెడ్డి, సురపల్లి జనార్ధన్, సింగపంగా మల్లయ్య, గడ్డం యాదగిరి, సింగపంగ రమేష్,వలిగొండ యాదయ్య,సముద్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు రూ.6000 పెన్షన్ వెంటనే పెంచాలి

### ఫరూఖ్ నగర్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష



**విశ్వంభర, షాద్ నగర్ :** రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలని, పెండింగ్లో ఉన్న ఆసరా పెన్షన్స్ వెంటనే మంజూరు చేయాలని వికలాంగుల జాతీయ వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ మండలం ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి టిడిపి నేతలు పటం శశిధర్ ,సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజు, శీను , జై స్వరాజ్ పార్టీ మార్ల ఆంజనేయులు మద్దతు ప్రకటించారు.అనంతరం ఆర్డీవో సరితకు వినత వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమపై మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని , ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6000 పెన్షన్ పెంపుకు కాలయాపన చేస్తుందని అవేదన వ్యక్తం చేశారు.

## పేద విద్యార్థులకు సగౌర ఆర్థిక సాయం

**విశ్వంభర, మలక్ పేట్ :** చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకున్న నిరుపేద విద్యార్థుల విద్యకు అంతరాయం కలగకుండా సగౌరా చారిటబుల్ సొసైటీ ఆర్థిక సహాయం చేశారు. మలక్పేటలో జరిగిన కార్యక్రమంలో నీట్ లో మంచి పెర్సెంటేజ్ సాధించి మెడిసిన్ సీటు సంపాదించిన కే యోగిత,బిఫార్మసీ చదువుతున్న ఎన్ భారతి లకు సగౌరా చారిటబుల్ సొసైటీ వారు ఇద్దరు విద్యార్థినిలకు చెరో రూ.25,000లు సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ , డాక్టర్ ప్రకాష్ , ప్రభాకర్ , చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించినందుకు పిఆర్టియు ఉపాధ్యక్షులు మందాడి వెంకట్ రెడ్డి, సిహెచ్ నారాయణ , సాంబశివరావు పాల్గొన్నారు.





## సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు అకాల్ తఖ్త్ శిక్ష

**చండీగఢ్:** పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సంబంధించి సిక్కులు అత్యున్నత ఆధ్యాత్మిక విభాగంగా పరిగణించే అకాల్ తఖ్త్ కీలక నిర్ణయం తీసుకుంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంతోపాటు ఇతర గురుద్వారాల్లో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని ఆదేశించింది. దీంతోపాటు శిరోమణి అకాలీదళ్ పార్టీ చీఫ్‌గా ఉన్న ఆయన రాజీనామాను ఆమోదించి.. ఆరు నెలల్లోగా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించింది.
శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 200717 మధ్య కాలంలో పార్టీతోపాటు వారి ప్రభుత్వం రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకాల్ తఖ్త్ నిర్ధరించింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చింది. తాను చేసిన తప్పులను అంగీకరించిన సుఖ్‌బీర్ బేషరతు క్షమాపణలు చెప్పారు.

## 'మహా' సీఎం ఎవరు.. దిల్లీకి వెళ్లిన అజిత్ పవార్



**దిల్లీ:** మరో మూడు రోజుల్లో మహారాష్ట్రలో నూతన ప్రభుత్వం కొలువు తీరనుంది. ముఖ్యమంత్రి పీఠంపై ఎవరు కూర్చోనున్నారనే అంశంపై మహాయుతి కూటమి ఇప్పటివరకు స్పష్టతనివ్వలేదు. ఈ క్రమంలోనే ఎన్సీపీ నేత అజిత్ పవార్ దిల్లీకి వెళ్లారు. స్వల్ప అనారోగ్యం కారణంగా స్వగ్రామానికి వెళ్లిన ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ శిందే.. ప్రస్తుత కీలక సమావేశాలను రద్దు చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అజిత్ పవార్ దిల్లీకి వెళ్లారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం భాజపా అగ్రనేతలతో సమావేశం కానున్నారు. శాఖల కేటాయింపులపై ప్రధానంగా చర్చలు జరగనున్నట్లు సమాచారం. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 స్థానాలను మహాయుతి కూటమి గెలుచుకుంది.డిసెంబరు 5న సీఎం ప్రమాణ స్వీకారం జరగనుంది. అయితే.. ఇప్పటివరకు ఆ పీఠాన్ని ఎవరు ఎక్కనున్నారనే దానిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోలేదు. దీనిపై స్పందించిన ప్రతిపక్షాలు.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే అజిత్ పవార్ దిల్లీ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

## కేసీఆర్ మొక్క కాదు.. ' కేసీఆర్ ఒక వేగు చుక్క : ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి... కేసీఆర్ ఒక వేగుచుక్క అని కొనియాడారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని కవిత ప్రశంసించారు.ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోము. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి... ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

## బీఆర్ఎస్ సినిమాకు శుభం కార్డు పడిపోయింది: ఆది శ్రీనివాస్



**విశ్వంభర, హైదరాబాద్:** బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సూరత్ నుంచి తెచ్చి బతుకమ్మ చీరలు ఇచ్చారని ఆరోపించారు. అవి పంట చేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయి తప్ప.. ధరించేందుకు పనికిరాలేదని మండిపడ్డారు. క్యాబినెట్‌లో మహిళకు స్థానం కల్పించని చరిత్ర భారాస సర్కారుదని విమర్శించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''బతుకమ్మ చీరలను అసలు మహిళలు కట్టుకున్నారా? ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని పాలన భారాస సర్కారుది. గ్రూప్ వన్ పేపర్లను లీక్ చేసిన చరిత్ర గత ప్రభుత్వానిది. భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది. సమగ్ర సర్వే చేయించి ఆ నివేదికలను అటకెక్కించారు. బీసీలకు భారాస అనుకూలమా? కాదా? తేల్చి చెప్పాలి. జనాభా దామాషా పద్ధతిలో అన్ని వర్గాలకు ఫలితాలు దక్కాల్సిందే. హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చాం. దానికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తున్నారు'' అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

### కుమారుడికి క్షమాభిక్ష..

# జో బైడెన్ సంచలన నిర్ణయం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు మారుడు హంటర్ బైడెన్‌కు భారీ ఊరట లభించింది. మరికొద్ది రోజుల్లో అధ్యక్ష పీఠం నుంచి దిగిపోనున్న జో బైడెన్.. తన కుమారుడికి కేసుల నుంచి పూర్తి ఉపశమనం కల్పించారు. అక్రమంగా ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఈసందర్భంగా జో బైడెన్ ఆరోపించారు.
''అమెరికా ప్రజలకు నిజాన్ని చెప్పాలి నా జీవితం మొత్తంలో నేను పాటిస్తున్న సూత్రం ఇదే..! న్యాయ శాఖ తీసుకునే నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోనని అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే చెప్పా. ఆ మాటకు నేను కట్టుబడి ఉన్నా. నా కుమారుడు హంటర్‌ను అన్యాయంగా విచారించే సమయంలోనూ నేను చూస్తూ ఉండిపోయా. రాజకీయ కుట్రలో భాగంగానే అతడిపై కేసులు పెట్టారు. ఇక జరిగింది చాలు. ఈ కేసుల్లో అతడికి క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించుకున్నా. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నా'' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్న బైడెన్.. తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది.

### హంటర్‌పై ఉన్న కేసులివే..

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. వాటికి బానిసగా మారారు. 11 రోజులపాటు అక్రమంగా ఆయుధం కలిగిఉన్నారు. ఇక, కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది.అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్‌పై నమోదైన కేసులో ఈ ఏడాది జూన్‌లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అయితే ఇప్పటివరకు శిక్ష ఖరారు చేయలేదు. దీనిపై అప్పట్లో జో బైడెన్ స్పందిస్తూ.. తీర్పును అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో తాను కుమారుడి తరఫున క్షమాభిక్ష కోరబోనని అప్పట్లో వెల్లడించారు. ఇప్పుడు అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో కుమారుడికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశాన్ని బైడెన్ వినియోగించుకున్నారు.

## తన షార్ప్‌నర్ దొంగలించారని విద్యార్థి ఫిర్యాదు..

### వెతికిచ్చిన పోలీసులు



**హర్దోయ్:** హత్యలు, దోపిడీలు, మోసాల వంటి కేసుల ఛేదనలో బిజీగా ఉండే పోలీసుల వద్దకు ఇటీవల ఓ వింత ఫిర్యాదు వచ్చింది. స్కూల్‌లో తన షార్ప్‌నర్ పోయిందంటూ ఓ చిన్నారి కంప్లెయింట్ చేశాడు. దాన్ని చూసి పోలీసులు తొలుత ఆశ్చర్యపోయినా.. తమ వంతు బాధ్యతగా కేసును ఛేదించారు. పోయిన షార్ప్‌నర్‌ను వెతికి పట్టుకుని చిన్నారికి అందించారు. అసలేం జరిగిందంటే..ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ ప్రాంతంలోని పలు స్కూళ్లలో పింక్ బాక్సులను (ఫిర్యాదు పెట్టెలు) ఏర్పాటు చేశారు. విద్యార్థులు స్కూళ్లలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదుల గురించి ఉత్తరాలు రాసి, అందులో వేయాలని వారికి సూచించారు. ప్రతివారం పాఠశాలలకు వెళ్లి, ఫిర్యాదు పెట్టెలోని లెటర్లను చదివి, వారి సమస్యలు పరిష్కరిస్తుంటారు. కాగా ఇటీవల ఓ పాఠశాలలోని పెట్టె తెరువగా కొందరు విద్యార్థులు తమను టీచర్లు కొడుతున్నారని, కొందరు తమ స్నేహితులు తరగతిలో అల్లరి చేస్తున్నారని, స్కూల్ బస్సులో గొడవపడుతున్నారని వారి సమస్యలు విన్నవించారు. ఓ విద్యార్థి తమ షార్ప్‌నర్ పోయిందని, ఎవరు తీసుకున్నారో తెలియదని వాపోయాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి.. కేసును ఛేదించి..షార్ప్‌నర్‌ను విద్యార్థికి అప్పగించారు. విద్యార్థుల నుంచి మొత్తం తమకు 12 ఫిర్యాదులు అందాయని, వాటిని వెంటనే పరిష్కరించామని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ''సమాజంలో మంచిని పెంపొందించాలంటే విద్యార్థి దశలోనే సాధ్యమని భావించాము. అందుకే పాఠశాలల్లో ఫిర్యాదు పెట్టెలు పెట్టి, వారి సమస్యలు పరిష్కరిస్తూ..చట్టంపై వారికి నమ్మకం కలిగేలా చేస్తున్నాము'' అని ఆయన తెలిపారు. ఇది కాస్త వైరల్‌గా మారడంతో హర్దోయ్ పోలీసులు చేస్తున్న పనిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల పిల్లల్లో చిన్న నాటి నుంచే సరైన ప్రవర్తనను, సమాజం పట్ల బాధ్యతను పెంచుతున్నారని కొనియాడారు.

## ఇదో ప్రత్యేక అనుభూతి.. నా కెరీర్‌లో అత్యున్నత దశ: విక్రాంత్ మాస్సే



**దిల్లీ:** గోద్రా రైలు దహనకాండ, గుజరాత్ అల్లర్లు ఆధారంగా చేసుకొని తెరకెక్కిన 'ది సబర్మతి రిపోర్ట్' )ను పార్లమెంట్ ప్రాంగణంలో ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఇతరులు వీక్షించారు. ఈ సినిమాలో ప్రధాన కథానాయకుడిగా నటించిన విక్రాంత్ మాస్సే దీనిపై స్పందించారు. పార్లమెంట్‌లోని లైబ్రరీలో ప్రదర్శించిన ఈ సినిమాను వీక్షించిన అనంతరం విక్రాంత్ మాస్సే మీడియాతో మాట్లాడారు. ''ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, ఎంపీలతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించడం చాలా సంతోషంగా ఉంది. ఇదో ప్రత్యేక అనుభూతి. మాటల్లో వర్ణించలేను. ఇది నా కెరీర్‌లో అత్యున్నత దశ'' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. నటి రాశీఖన్నా స్పందిస్తూ.. ''ఇప్పటివరకు ఈ సినిమాను చాలా సార్లు చూశాం. కానీ, ప్రధాని మోదీ సమక్షంలో చూడడం చాలా స్పెషల్. ఇప్పుడు ఈ సినిమాను ప్రజలు మరింత ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అని అన్నారు. సినిమా చూసిన అనంతరం బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రంలో చాలా ముఖ్యమైన అంశాలను చూపించారు. గత ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టేందుకు యత్నించింది. కొంతమంది ఎలాంటి రాజకీయాలకు పాల్పడ్డారో ఈ సినిమాలో చక్కగా చూపించారు'' అని వ్యాఖ్యానించారు. కాగా.. 2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లు, గోద్రా రైలు దహనకాండ యావత్ దేశాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది ఫిబ్రవరి 27న పంచమహల్ జిల్లాలోని గోద్రా పట్టణంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు కొందరు దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 59 మంది ప్రాణాలు కోల్పోయారు.దీన్ని ఆధారంగా చేసుకొని బాలీవుడ్ దర్శకుడు ధీరజ్ సర్నా 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను తెరకెక్కించారు. విక్రాంత్ మాస్సే, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటించారు. రిధి డోగ్రా కీలకపాత్ర పోషించారు. నవంబర్ 15న ఇది విడుదలైంది. నేడు పార్లమెంట్‌లో ప్రదర్శించిన ఈ చిత్రాన్ని ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్రమంత్రులు వీక్షించారు.

## రేవంత్ రెడ్డి దళిత ద్రోహి.. మండిపడ్డ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** దళిత బంధు నిధులు ఇవ్వకుండా దళితులను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.దళితబంధుకు హుజురాబాద్ నియోజకవర్గాన్ని కేసీఆర్ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. మొదటి విడత దళిత బంధు లబ్ధిదారులకు ఇచ్చాము. హుజురాబాద్ నియోజకవర్గంలో రెండవ విడత దళితబంధు ఇవ్వాలని నేను అసెంబ్లీలో అడిగాను. కానీ రెండవ విడత దళితబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీజ్ చేసింది. 33 జిల్లాల్లో దళితబంధు ఆపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబంధు నేను ఆపానని అంటున్నారు. తెలంగాణలో రెండు లక్షల మందికి దళితబంధు ఇచ్చాము. దళితబంధుతో అనేక మందికి లబ్ధి జరిగింది అని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు.
దళితబంధు విడుదల చేయాలని పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు దళితులు వినతిపత్రం ఇచ్చారు. కేసీఆర్ పథకాలు మేము ఇవ్వమని మంత్రులు అంటున్నారు. దళితబంధు అడిగితే ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. దళిత మహిళలపై కేసులు పెట్టారు. హుజురాబాద్ ఏసీపీ దళితులను ఇబ్బంది పెడుతున్నారు. హుజూరాబాద్ ఏసీపీ చిట్టా మొత్తం నా దగ్గర ఉంది. పోలీసుల బెదిరింపులకు మేము భయపడం. మేము రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలుస్తాం. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితులపై నమోదైన కేసులపై దళిత సంఘాలు స్పందించాలి. స్థానిక ఏసీపీ, సీఐలపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాము. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు ఇచ్చే వరకు నేను పోరాటం చేస్తాను అని పాడి కౌశిక్ రెడ్డి తేల్చిచెప్పారు.



## కాలుష్యం తగ్గుముఖం పట్టే వరకు నిబంధనలు సడలించొద్దు: సుప్రీం

**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు విధించిన గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్4 (జీఆర్ఏపీ4) నిబంధనలు సడలించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించలేదు. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. ఈ నిబంధనల కారణంగా ఉపాధి కోల్పోయిన నిర్మాణ రంగ కార్మికులకు ఏదైనా పరిహారం చెల్లించారా లేదా అనే విషయం వెల్లడించేందుకు దిల్లీ, హరియాణ, రాజస్థాన్, యూపీ రాష్ట్రాలకు చెందిన ఆయా విభాగాల ప్రధాన కార్యదర్శులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిసెంబర్ 5న తమ ఎదుట హాజరుకావాలని సూచించింది.
రాజధానిలో వాయుకాలుష్యం తగ్గుముఖం పట్టేందుకు జీఆర్ఏపీ4 నిబంధనలు అమలు చేయడం చాలా అరుదని బెంచ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ట్రక్కులను దిల్లీలోకి రాకుండా ఆపేందుకు, నిబంధనల అమలుకు ఎంతమంది అధికారులను మోహరించారని దిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.
దీనిపై దిల్లీ ప్రభుత్వ తరఫున హాజరైన న్యాయవాది షాదన్ ఫరాసాత్ మాట్లాడుతూ నిబంధనలు పాటించడంలేదన్న ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. కేవలం రెండు లేదా మూడు ఘటనల ఆధారంగా 1.5 కోట్ల మంది ఉన్న దిల్లీలో జీఆర్ఏపీ4 రూల్స్ అతిక్రమిస్తున్నట్లు చెప్పలేమన్నారు.

## సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని.. వాజేడు ఎస్సై ఆత్మహత్య



**విశ్వంభర, వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రుద్రారపు హరీశ్ (29) సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోదావరి సమీపంలోని ఫెరియాడో రిసార్ట్ గదిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటాపురం సీఐ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ రిసార్ట్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. మృతుడి స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి. వ్యక్తిగత కారణాలతో హరీశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

## పెద్దపులి మహారాష్ట్ర వెళ్లిపోయి ఉంటుంది

**: ఆసిఫాబాద్ డీఎఫ్‌వో**



**విశ్వంభర, ఆసిఫాబాద్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులి కదలికలపై డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ స్పందించారు. పెద్దపులి మహారాష్ట్ర వెళ్లిపోయిందని భావిస్తున్నామని ఆయన తెలిపారు. సోమవారం డీఎఫ్‌వో మీడియాతో మాట్లాడుతూ.. పెద్ద పులి కోసం తమ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని తెలిపారు.పెద్దపులి జాడ కోసం మూడు రోజులుగా అడవిలో 20 బృందాలు గాలిస్తున్నాయని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ తెలిపారు. అయితే చీలపల్లి, ఆరగూడ వైపుగా మహారాష్ట్రకు వెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. మహారాష్ట్ర అంతర్గాంలో తాజాగా ఓ పశువుపై పులి దాడి చేసిందని చెప్పారు. మహారాష్ట్రలో పశువుపై దాడి చేసిన పులి.. కాగజ్‌నగర్‌లో కనిపించిన పులి ఒక్కటే అని తాము భావిస్తున్నామని అన్నారు.

**ఆపరేషన్ టైగర్..**

ఆసిఫాబాద్ జిల్లాలోని 15 గ్రామాల్లో అధికారులు 163సెక్షన్ విధించారు. కవ్వాల్ అభయారణ్యంలో నాలుగేళ్లలో పులుల సంఖ్య అనుహ్యంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అందుకే ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబర్‌లో సహజంగా మగ ఆడ పులులు జతకట్టే సమయం అని, అందులో భాగంగా పులులు సాధారణం కంటే తమ జోడు కోసం అడవిలో ఎక్కువ దూరం ప్రయాణం చేస్తుంటాయని అధికారులు చెప్పారు. కొన్ని సందర్భాల్లో అడవిని దాటి చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ సంచరిస్తూ ఉంటాయని వెల్లడించారు. ఈ సమయంలో పులులు సహజంగా కొంత ఉద్రేకంతో ఉంటాయని తెలిపారు. తమ తోడును వెతుకునే క్రమంలో పులులు చురుకుగా తిరుగుతూ ఉంటాయని, అందుకే నవంబర్,డిసెంబర్‌లో పులి దాడులు పెరుగుతున్నాయని అధికారులు వివరించారు.

# ఆ రెండు నగరాలకు మెట్రో రైల్.. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### తొలిదశ డీపీఆర్‌కు ఆమోదం

**అమరావతి :** విశాఖ, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖ తొలిదశలో 11 వేల 498 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 46 కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వ కారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మించనున్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30 కిలోమీటర్లు మరో కారిడార్ నిర్మించనున్నారు. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ మెట్రో రైల్ రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో రెండు కారిడార్‌లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1 బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు చేపట్టనున్నారు.

ఇక రెండో దశలో కారిడార్ 3గా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బి లను 38.4 కిలోమీటర్ల మేర నిర్మించాలని డీపీఆర్‌లో ప్రతిపాదించారు. దీనికి రూ.11,009 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బిల భూసేకరణకు రూ.1152 కోట్ల వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని డీపీఆర్‌లో స్పష్టం చేశారు. ఇక



రెండో దశలో నిర్మించే మూడో కారిడార్‌ను 27.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు. విజయవాడ, విశాఖ మెట్రోరైల్ డీపీఆర్‌లను కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# అమరావతి అభివృద్ధికి రూ.11,467 కోట్లు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.11,467 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం ఆయన నివాసంలో నిర్వహించిన క్యాపిటల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) 41వ మీటింగ్‌లో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. సమావేశంలో మొత్తం 23 అంశాలపై చర్చించామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి, ఇతర పనులకు రూ.2,498 కోట్లు, పాలవాగు, కొండవీటివాగుల పనులకు రూ.1,508 కోట్లు, రూ.3,523 కోట్లతో మూడు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. అమరావతిలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీల నిర్మాణాలు చేపడుతామన్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా చేపట్టబోయే ఐదు ఐకానిక్ టవర్ల తుది డిజైన్‌లు ఈనెల 15వ తేదీలోగా సమర్పిస్తారని తెలిపారు. వాటికి ఆమోదం లభిస్తే ఈ నెలాఖరులోగానే టెండర్ నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు.

## తిరుమల స్థానికులకు దర్శన టోకెన్లు జారీ



**తిరుమల:** గత నెలలో జరిగిన తొలి టీటీడీ బోర్డు సమావేశంలో స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని తీర్మానం చేసిన మేరకు సోమవారం తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో తిరుపతి ఎమ్మెల్యే శ్రీ అరణి శ్రీనివాసులుతో కలిసి తిరుమల స్థానికులకు దర్శన టోకెన్ల జారీని టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరించేందుకు తొలి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. శ్రీవేంకటేశ్వరుని దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం పట్ల స్థానికులు ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. అనంతరం అడిషనల్ ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ తిరుమల, తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, చంద్రగిరి స్థానికులకు దర్శన కోటా ఖరారు చేసేందుకు టీటీడీ అధికారులు తీవ్ర కసరత్తు చేశారన్నారు. సామాన్య భక్తులు, ప్రత్యేక ప్రవేశ దర్శన కోటాకు ఎలాంటి అంతరాయం కలగకుండా స్థానికుల దర్శన కోటా పునరుద్ధరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శ్రీ శాంతారాం, సీవీఎస్వో శ్రీ శ్రీధర్, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మద్యం వ్యాపారులకు ప్రభుత్వం వార్నింగ్

**అమరావతి:** మద్యం అక్రమాలపై భారీ జరిమానాలు విధిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే 5 లక్షలు జరిమానా విధిస్తామని తెలిపింది. మరోసారి అదే తప్పు చేస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని నోటిఫికేషన్‌లో వివరించింది. అదే విధంగా మద్యం దుకాణం పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించినా ఐదు లక్షల జరిమానా విధిస్తామని పేర్కొంది. ఏపీ ఎక్సైజ్ చట్టం 47-1 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసింది. బార్ లైసెన్సులకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని నోటిఫికేషన్‌లో తెలిపింది.



## ఏపీలో తొలిసారి తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం

**అమరావతి:** రెండు తెలుగు రాష్ట్రాల విభజన అంశాలపై సీఎస్ శాంతికుమారి, ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ నేతృత్వంలోని అధికారుల కమిటీ భేటీ అయ్యింది. విభజన చట్టంలో అపరిష్కృతంగా ఉన్న 9,10 షెడ్యూల్ లోని సంస్థల ఆస్తుల పంపకాలు, విద్యుత్ బకాయిలు, ఉద్యోగుల పరస్పర మార్పిడిపై చర్చించినట్లు సమాచారం. ఉద్యోగుల పరస్పర మార్పిడి , వృత్తి పన్ను పంపకంపై చర్చించనున్నారు. ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంపై కూడా చర్చించే అవకాశం ఉంది. ఇక విభజన పూర్తి కాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా అధికారుల కమిటీలో చర్చ జరగనుంది.షెడ్యూలు 9,10 లోని సంస్థల బ్యాంకు ఖాతాల్లో పంపకం కాకుండా మిగిలిపోయిన 8 వేల కోట్ల అంశంపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యల పరిష్కారం దిశగా మరో కీలక అడుగు పడింది. ఇప్పటికే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హైదరాబాద్ లో ఒకసారి భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల



మధ్య ఉన్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలనే దానిపై వీరిద్దరూ ప్రాథమిక చర్చలు జరిపారు. తాజాగా ఈరోజు ఇరు రాష్ట్రాల సీఎస్ లు భేటీ అయ్యారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు



**తిరుమల:**

ఫెంజల్ తుపాను ప్రభావంతో తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండో ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు జేసీబీలతో బండరాళ్లను తొలిగిస్తున్నారు. మరోవైపు తిరుమలలో రెండురోజులుగా పడుస్తున్న వర్షాలతో ఐదు ప్రధాన జలాశయాలు దాదాపుగా నిండిపోయాయి. తిరుమలలో పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల సమయానికి మొత్తం ఐదు జలాశయాల్లో నీటి మట్టం దాదాపు పూర్తి స్థాయికి చేరుకున్నది. ఫెంజల్ తుపాను ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ కారణంగా విశాఖ నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తిరుపతిలో భారీ వర్షాల కారణంగా విశాఖ-తిరుపతి విమాన సర్వీసులను రద్దు చేశారు.బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంజల్ తుపాను శనివారం సాయంత్రం తమిళనాడు తీరాన్ని తాకింది. తీరం వెంబడి గరిష్ఠంగా గంటకు 90 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. చాలా జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి. చెన్నైలో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. గాలులు, కుండపోత వర్షాలతో సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. పుదుచ్చేరిలో పర్యాటక ప్రాంతాలనూ మూసివేశారు.

## పవన్ కల్యాణ్, షర్మిలపై బొత్స సత్యనారాయణ విమర్శలు



**అమరావతి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిలపై వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం స్మగ్లింగ్ అవుతోందని పవన్ అంటున్నారని... స్మగ్లింగ్ చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకోవద్దని ఎవరన్నారని ప్రశ్నించారు. పవన్ తీరు చూస్తుంటే గబ్బర్ సింగ్-3 గుర్తుకు వస్తోందని అన్నారు. మంత్రి ప్రమేయం లేకుండానే ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయా? అని ప్రశ్నించారు. పవన్ చిత్తశుద్ధిని తాను శంకించడం లేదని చెప్పారు. 2004లో మంత్రి అయినప్పుడు తనకు ఎన్నో అధికారాలు ఉంటాయని భ్రమ పడ్డానని తెలిపారు. మంత్రి పదవి వచ్చినప్పుడు తొలుత 'హూ' అంటామని... ఆ తర్వాత 'ఆ' అంటామని చెప్పారు. షర్మిల ఒక రాజకీయ పార్టీ నాయకురాలిగా మాట్లాడటం లేదని బొత్స అన్నారు. ఆమెను మీరు గుర్తిస్తున్నారేమో కానీ, తాము మాత్రం గుర్తించడం లేదని చెప్పారు. పీసీసీ చీఫ్ గా పలు అంశాలపై మాట్లాడాలని, వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడకూడదని అన్నారు. గతంలో తాను కూడా పీసీసీ అధ్యక్షుడిగా పని చేశానని గుర్తు చేసుకున్నారు.

## మోహన్ భగవత్ వ్యాఖ్యలపై రేణుకా చౌదరి మండిపాటు

**అమరావతి:** వరుసగా పిల్లలను కనడానికి మహిళలు ఏమైనా కుందేళ్లా? అని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి మండిపడ్డారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఇటీవల పిలుపునిచ్చారు. దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేత రేణుకా చౌదరి తీవ్రంగా



స్పందించారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదన్నారు. ఉద్యోగం లేని అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. మోహన్ భగవత్ ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్నాడని, కానీ అలా కనేందుకు మహిళలు కుందేళ్లు కాదన్నారు. ఈ మాటలు చెప్పేవాళ్లు ఎంతమంది పిల్లలను పెంచగలరు? అని ప్రశ్నించారు. అలా మాట్లాడేవారి అనుభవాలు ఏమిటో బాగా తెలుసని వ్యాఖ్యానించారు. దేశంలో పెరుగుతున్న ధరలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే చికిత్సకయ్యే ఖర్చు భారీగా ఉంటోందన్నారు.

# ఏపీకి 'ఫెయింజల్' తుఫాను ఎఫెక్ట్

**అమరావతి:**

ఫెయింజల్ తుపాను బలహీన పడి తీవ్ర వాయు గుండంగా మారింది. ఈ విషయాన్ని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తా తమిళనాడు, పుదుచ్చేరిని అనుకున్న ఉంది ఈ తుఫాన్. దీని కారణంగా రానున్న రెండురోజుల్లో ఏపీ, తెలంగాణలో తేలిపాకటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. సోమవారం అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా తీరంలో గంటలకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇక తెలంగాణకు వస్తే.. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వాటిలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగామ జిల్లాలు ఉన్నాయి. ఫెయింజల్ దెబ్బకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తాలో వేలాది ఎకరాల పంట దెబ్బతింది. చాలా చోట్ల బలమైన గాలులకు వరి నేల వాలింది. కమర్షియల్ పంటలైన వేరు శెనగ, మినుము, పెసలు, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. కడప, చిత్తూరు జిల్లాల్లో అరటి, పూలతోటలు, కూరగాయలపై తీవ్ర ప్రభావం చూపింది. వర్షాల ధాటికి తిరుపతి నుంచి తిరుమల వెళ్లే రూట్లో పలు చోట్ల కొండ చరియలు జారిపడ్డాయి. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. రాకపోకలు యధావిధిగా పునరుద్ధరించారు. తిరుమలలో పార్కింగ్ ప్రదేశాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో తుఫాను తగ్గుముఖం పట్టడంతో కొన్ని ప్రాంతాల్లో సాధారణ స్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు అవుతున్నాయి. 15 డిగ్రీలపై ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మెదక్ – 15.8 డిగ్రీలు, ఆదిలాబాద్- 19.7, హయత్ నగర్- 20 డిగ్రీలు, పఠాన్ చెరు- 20.4 డిగ్రీలుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఇక తమిళనాడు విషయానికొస్తే.. విల్లుపురం జిల్లాలో ఏకంగా 51 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఎప్పుడూ లేని విధంగా ఈసారి భారీ వర్షాల్ని చవి చూసింది. కడలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలపై ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్షించారు. ఆయా జిల్లాల్లో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రులు, కలెక్టర్లులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు.

ఆదివారం సైతం మూడు జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. వాటిలో విల్లుపురం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలు ఉన్నాయి. పుదుచ్చేరికి రెడ్ అలెర్ట్ కంటిన్యూ చేశారు. మరోవైపు వరద బాధితులకు సాయం అందజేసే కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి.

తుఫాను కారణంగా తమిళనాడు నుంచి వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను రద్దు చేశారు అధికారులు. ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించారు. నాగర్ కోయిల్ – తాంబర్ వీక్లీ ట్రైన్, తిరునెల్వేలి- ఎగ్మూరు, తాంబరం- రామనాథపురం రైళ్లను పొడిగించిన వాటిలో ఉన్నాయి. చెన్నైలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో విమానాశ్రయంలో సేవలు మొదలయ్యాయి. తొలుత ఆదివారం రాత్రి ఏడు గంటలకు సేవలు మొదలుపెట్టాలని భావించినప్పటికీ సాధ్యం కాలేదు. అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు మొదలుపెట్టినట్టు అధికారులు వెల్లడించారు.



# హైబ్రిడ్ మోడల్‌కు PCB ఎప్పుడో ఓకే




**విశ్వంభర, క్రీడావిభాగం:** 2025 ఛాంపియన్స్ ట్రోఫీపై కొనసాగుతున్న సస్పెన్స్‌పై పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ స్పందించాడు. ఇటీవల జరిగిన ఐసీసీ మీటింగ్‌లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించినట్లు తెలిసింది. అయితే దీని గురించి అధికారికంగా వార్తలు రాకముందే పీసీబీ హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించిందని షోయబ్ అక్తర్ పేర్కొన్నాడు. ఈ క్రమంలోనే పీసీబీ తీసుకున్న ఓ నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. ఈ మేరకు ఓ టీవీ ఛానెల్ డిబేట్‌లో షోయబ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ తమ వైఖరి మార్చుకొని భారత్ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించేందుకు ఓకే చెప్పింది. అయితే దీనికి పీసీబీ కొన్ని షరతులు విధించింది. భవిష్యత్‌లో భారత్ ఆతిథ్యమిచ్చే అన్ని టోర్నీల్లో పాకిస్థాన్ మ్యాచ్‌లనూ తటస్థ వేదికల్లోనే నిర్వహించాలని కండీషన్ పెట్టింది. అయితే ఈ నిర్ణయాన్ని షోయబ్ తప్పుబట్టాడు. భారత్‌కు వెళ్లి అక్కడే టీమ్‌ఇండియాను ఓడించాలని పేర్కొన్నాడు. 'భవిష్యత్‌లో భారత్‌లో ఆడే విషయంలో మనం స్నేహహస్తం చాచాలి. మనం అక్కడికి వెళ్లాలి. భారత్‌కు వెళ్లి వారిని వాళ్ల సొంతగడ్డపైనే ఓడించాలి. ఇక హైబ్రిడ్ మోడల్‌కు ఇప్పటికే అంగీకరించినట్లు నేను భావిస్తున్నా' అని అక్తర్ తెలిపాడు.

**పాకిస్థాన్ వైఖరి సరైందే!**

అయితే టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరిగితే రెవెన్యూలో అధిక వాటాను పీసీబీ డిమాండ్ చేసింది. దీన్ని షోయబ్ అక్తర్ సమర్థించాడు. 'మన దేశంలో నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ రావడానికి ఇష్టపడకపోతే, ఎక్కువ రెవెన్యూను పంచాలన్న పీసీబీ డిమాండ్ సరైనదే. దీనిని మనమందరం అర్థం చేసుకుంటాం' అని అన్నాడు.

# ఆసీస్ సిరీస్ 2-2తో డ్రా అయినా భారత్ ఫైనల్ బెర్త్ పక్కా!

- డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఆశలన్నీ మ్యాజిక్ మీదే..




**విశ్వంభర, క్రీడావిభాగం:** 2025 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసు రసవత్తరంగా మారింది. తాజాగా శ్రీలంకపై భారీ విజయంతో సౌతాఫ్రికా రెండో స్థానంలోకి దూసుకొచ్చింది. ప్రస్తుతం 61.10 పాయింట్ శాతంతో భారత్ టాప్‌లో ఉండగా, సౌతాఫ్రికా 59.260, ఆస్ట్రేలియా 57.690తో వరుసగా రెండు, మూడు ప్లేస్‌ల్లో కొనసాగుతున్నాయి. దీంతో టాప్ 2 స్థానాల కోసం భారత్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక వరుసగా మూడోసారి ఫైనల్ బెర్త్‌పై టీమ్‌ఇండియా కన్నేసింది. ఇటీవల స్వదేశంలో కివీస్‌తో 3-0తో ఓడినా, ఆసీస్ గడ్డపై విజయంతో సిరీస్ ప్రారంభించి ఆశలు నిలుపుకుంది. అయితే శ్రీలంకపై సౌతాఫ్రికా విజయం సాధించడం వల్ల టీమ్‌ఇండియా ఫైనల్ సమీకరణాలు మారాయి. బోర్డర్- గావస్కర్ ట్రోఫీని భారత్ 5-0, 4-1, 4-0 లేదా 3-0తో కైవసం చేసుకుంటే నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఈ నాలుగు సమీకరణాల్లో భారత్ ఏ ఒక్క తేడాతోనైన సిరీస్ గెలుచుకోగలితే ఫైనల్ చేరుకోవడం పక్కా. ఇలా కాకుండా కింద పేర్కొన్న విధంగానూ భారత్ ఫైనల్ చేరుకోవచ్చు! ఇలా నెగ్గితే నేరుగా ఫైనల్స్‌కు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 5-0, 4-1 లేదా 3-0తో గనుక టీమిండియా గెలిస్తే నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకుంటుంది. అదే జరిగితే ఆసీస్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది. పైవిధంగా గెలవకున్నా కనీసం 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకున్నా రోహిత్ సేన ఫైనల్ చేరే అవకాశం ఉంటుంది. అయితే సౌతాఫ్రికాతో జరిగే రెండో టెస్ట్‌లో శ్రీలంక విజయం సాధించాలి. ఒకవేళ ఆ మ్యాచ్ డ్రా అయినా కూడా కంగారూలపై భారత్ 3-1తో నెగ్గితే ఫైనల్‌కు క్వాలిఫై అవుతుంది.

**ఈ మ్యాజిక్ జరగాలి**

బీజీటీని 3-2తో సొంతం చేసుకున్నా టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. కానీ ఆసీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో శ్రీలంక తప్పకుండా ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలి. అప్పుడే భారత్ ఫైనల్‌కు క్వాలిఫై అవుతుంది. ఆస్ట్రేలియాతో సిరీస్ 2-2తో డ్రా అయినా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే ఛాన్స్ ఉంటుంది. కానీ దీనికి శ్రీలంక వైపు నుంచి మ్యాజిక్ జరగాలి. ఆ టీమ్ సౌతాఫ్రికాతో సిరీస్‌ను 2-0 తేడాతో సొంతం చేసుకోవాలి.

# అతనే భారత భవిష్యత్తు సారథి: పుజారా




**విశ్వంభర, క్రీడావిభాగం:** భారత టెస్టు జట్టు భవిష్యత్తు సారథి స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అని సీనియర్ బ్యాటర్ ఛెతేశ్వర్ పుజారా అన్నాడు. సుదీర్ఘ కాలం భారత జట్టును బుమ్రా నడిపిస్తాడని తెలిపాడు. బుమ్రా జట్టు మనిషి అని, తన ప్రదర్శన గురించి కాకుండా జట్టు లాభం గురించి ఆలోచిస్తాడని పేర్కొన్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టుకు వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ దూరమవ్వడంతో, టీమిండియాను బుమ్రా గొప్పగా నడిపించిన విషయం తెలిసిందే. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన అనంతరం తీవ్ర ఒత్తిడిలో బరిలోకి దిగిన భారత్‌ను బుమ్రా నడిపించిన తీరుపై ప్రశంసలు వచ్చాయి. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై టీమిండియా 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఆరంభ పోరులో ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటింది.

''బుమ్రా సుదీర్ఘ కాలం భారత కెప్టెన్‌గా ఉంటాడనడంలో ఎలాంటి సందేహం లేదు. సొంతగడ్డపై కఠిన సిరీస్ (న్యూజిలాండ్)ను ఎదుర్కొన్న అనంతరం, ఆస్ట్రేలియాలో తొలి టెస్టు ఆడిన విధానం అసాధారణం. బుమ్రాకు జట్టును నడిపించే సామర్థ్యం ఉంది. అతను టీమ్ మ్యాన్. అతన్ని చూడండి.. తన గురించి మాత్రమే ఎప్పుడు మాట్లడడు. జట్టు గురించి, ఇతర ఆటగాళ్ల గురించే మాట్లాడతాడు''

''కొన్ని సందర్భాల్లో ఆటగాళ్లకు సలహాలు అవసరం ఉండవు. దానిని బుమ్రా అంగీకరిస్తాడు. ఇక అనుభవజ్ఞులు ఉన్నప్పుడు అతను మౌనంగా ఉంటాడు. అతను మంచి కెప్టెన్ అనడానికి ఇదే సంకేతం. అతను కిందిస్థాయి నుంచి పైకి వచ్చాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లతో సరదాగా ఉంటాడు. సాయం చేయడానికి ఆతృతగా ఉంటాడు. అతను ఎంతో మంచి వ్యక్తి. క్రికెట్ అవతల కూడా అతని వ్యక్తిత్వం వినయంగానే ఉంటుంది'' అని పుజారా పేర్కొన్నాడు.

కాగా, బుమ్రా నుంచి రోహిత్ టీమిండియా సారథి బాధ్యతలు తిరిగి అందుకున్నాడు. అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రెండో టెస్టు నుంచి జట్టును నడిపించనున్నాడు. అడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి రెండో టెస్టు జరగనుంది. ఈ డే/నైట్ మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది.

# రూ.23 కోట్ల ప్లేయర్ ఉండగా అతడికే కేకేఆర్ పగ్గాలు




**విశ్వంభర, క్రీడావిభాగం :** ఐపీఎల్ 2025లో కెప్టెన్ల కొరత సమస్యను చాలా జట్లు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అందులో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కూడా ఒకటి . గత ఐపీఎల్ సీజన్‌లో టీమ్‌ను విజేతగా నిలబెట్టినప్పటికీ, ఏకంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌నే వదులుకుంది కేకేఆర్. దీంతో ఇప్పుడు కొత్త సారథి కోసం కేకేఆర్ అన్వేషణను ప్రారంభించింది. అయితే ఇప్పుడు వేలంలో భారీ మొత్తానికి తిరిగి దక్కించుకున్న వెంకటేశ్ అయ్యర్‌కే కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని ఆ మధ్య ప్రచారం సాగింది. అయితే, సీనియర్ అజింక్య రహానేకు సారథ్య బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్లు తాజాగా సమాచారాం అందుతోంది. రీసెంట్‌గా జరిగిన మెగా వేలంలో కేకేఆర్, వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు దక్కించుకుంది కేకేఆర్. అదే సమయంలో రహానెను రూ.1.5 కోట్ల కనీస ధరకు కొనుగోలు చేసింది. భారీ మొత్తానికి దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్ కన్నా, ఎంతో ఎక్స్‌పీరియన్స్ ఉన్న రహానెకు ఐపీఎల్ 2025 సీజన్ జట్టు బాధ్యతలను అప్పగించాలని ఫ్రాంచైజీ ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం అందుతోంది. అయితే కెప్టెన్సీ విషయంలో ఇప్పటికే రహానె పలుసార్లు సత్తా చాటాడు. టీమ్ ఇండియాను గతంలో పలు సార్లు ముందుండి నడిపించాడు కూడా. ప్రస్తుతం రంజీ ట్రోఫీలోనూ ముంబయి జట్టు సారథిగానూ వ్యవహరిస్తున్నాడు. దీంతో వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కేకేఆర్ కెప్టెన్సీ విషయంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

"నిజమే, ప్రస్తుతానికి రహానెకు కేకేఆర్ కొత్త కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ 90 శాతం నిర్ణయానికి వచ్చింది. సారథ్య బాధ్యతల కోసమే అతడిని ఆక్షన్‌లోకి తీసుకుంది" అంటూ కేకేఆర్ వర్గాలు చెప్పినట్లు ఓ మీడియా కథనంలో పేర్కొంది. అంతకుముందు కెప్టెన్సీ రేసులో తానూ ఉన్నట్లు వెంకటేశ్ అయ్యర్ చెప్పిన సంగతి తెలిసిందే. "జట్టు కోసం ప్రతి ఒక్కరూ ఆడేలా వాతావరణాన్ని క్రియేట్ చేయడం సారథి బాధ్యత. ఆ రెస్పాన్సిబిలిటీస్ అప్పగిస్తే, స్వీకరించడనాకి ఎంతో ఆనందంగా ఉన్నాను" అని పేర్కొన్నాడు. నితీశ్ రాణా లేనప్పుడు గతంలో జట్టును పలు సార్లు ముందుండి నడిచిపించినట్లు వెల్లడించాడు. కాగా, వచ్చే సీజన్‌కు రహానెకు పూర్తి స్థాయి సారథ్య బాధ్యతలు అప్పగించి, వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్సీని బాధ్యతలు అప్పగించాలని కేకేఆర్ యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. మరి కేకేఆర్ ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటుందో చూడాలి.

# సిరాజ్ పుంజుకోవడం వెనక బుమ్రా సలహాలు




**విశ్వంభర, క్రీడావిభాగం:** టీమ్‌ఇండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ ఇటీవల సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే ఆస్ట్రేలియా సిరీస్‌లో మాత్రం సిరాజ్ అద్భుతంగా పుంజుకున్నాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టు లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 5 వికెట్లు పడగొట్టి విమర్శలకు చెక్ పెట్టాడు. ఈ క్రమంలో తాను ఇంత త్వరగా కమ్ బ్యాక్ ఇవ్వడం వెనక స్టార్ పేసర్ బుమ్రా ఉన్నట్లు పేర్కొన్నాడు. ఈ క్రెడిట్ అంతా బుమ్రాకే దక్కుతుందని తెలిపాడు. 'బుమ్రాతో నేను తరతూ మాట్లాడుతుంటా. తొలి మ్యాచ్‌కు ముందు కూడాఅతడితో మాట్లాడాను. బౌలింగ్‌లో నేను ఎదుర్కొంటున్న పరిస్థితిని బుమ్రాకు వివరించాను. అతడు చెప్పిందల్లా ఒకటే. 'వికెట్ల కోసం పరిగెత్తకు. ఒకే ప్రాంతంలో నిలకడగా బంతులు వేయడానికి ప్రయత్నించు. నీ బౌలింగ్‌ను నువ్వు ఆస్వాదించు. అప్పటికీ వికెట్లు దక్కకపోతే మళ్లీ నా దగ్గరికి రా' అని భరోసా ఇచ్చాడు. దీంతో నా బౌలింగ్ మార్చుకున్నాను. నా బౌలింగ్ నేను ఎంజాయ్ చేశా. దీంతో వికెట్లు తీయగలిగాను' అని చెప్పాడు. ఇక మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ కూడా తనకు మంచి సలహాలు ఇచ్చాడని, తన బౌలింగ్‌ను అతడు చాలాకాలం నుంచి గమనిస్తున్నాడని సిరాజ్ తెలిపాడు. కాగా, ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సిరీజ్ పూర్తిగా తేలిపోయాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సిరాజ్ కేవలం రెండు వికెట్లే తీశాడు. ఆ తర్వాత ఆసీస్‌తో సిరీస్‌లో కమ్‌బ్యాక్ ఇచ్చి తొలి టెస్టులోనే ఐదు వికెట్లు పడగొట్టాడు. తొలి టెస్టు కెప్టెన్, స్టార్ పేసర్ బుమ్రా ఇచ్చిన సలహాలు తనకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపాడు.

# రిషబ్ పంత్ స్టైల్‌లో సిక్స్ కొట్టిన పూరన్



**విశ్వంభర, క్రీడావిభాగం :** టీ20ల్లో అత్యంత ప్రమాదకర బ్యాటర్లలో వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ ఒకరు. ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్‌కు సునాయాసంగా సిక్సర్లు సాధించే సామర్థ్యం సొంతం. ఇప్పటికే యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పలు రికార్డులు బ్రేక్ చేశాడు. అయితే అబుదాబి టీ10 లీగ్‌లో ఓ బంతిని పూరన్ వినూత్నంగా స్టాండ్స్‌కు తరలించాడు. తన శైలికి విరుద్ధంగా టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తరహాలో స్కూప్ షాట్‌తో సిక్సర్ బాదాడు. అబుదాబి లీగ్‌లో దక్కన్ గ్లాడియేటర్స్ తరఫున ఆడుతున్న పూరన్.. మోరిస్విల్లే సాంప్ ఆర్మీతో జరిగిన క్వాలిఫయిర్-1లో 33 బంతుల్లో 72 పరుగులు సాధించి జట్టుకు విజయాన్ని అందించాడు. 4 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. అయితే అవుట్‌సైట్ ఆఫ్ స్టంప్ మీదుగా మహ్మద్ జహీద్ వేసిన ఫుల్ టాస్‌ను పూరన్ కిందపడి మరీ ఫైన్ లెగ్ మీదుగా సిక్సర్ బాదడం విశేషం. పంత్ కూడా కింద పడుతూ బంతిని బౌండరీలకు తరలిస్తుంటాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగన తొలి టెస్టులోనూ పంత్ ఇదే తరహాలో సిక్సర్ బాదాడు. ప్యాట్ కమిన్స్ ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ వైపుగా వేసిన బంతిని పంత్.. డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ మీదుగా స్కూప్ షాట్‌తో సిక్సర్ సాధించాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కాగా, ఈ ఇద్దరు హిట్టర్లు ఐపీఎల్‌లో ఒకే జట్టుకు ఆడనుండటం విశేషం. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగనున్నారు. పంత్ కోసం లక్నో ఫ్రాంచైజీ రూ.27 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. ఐపీఎల్ వేలం చరిత్రలో అత్యంత గరిష్ఠ ధర పలికిన ప్లేయర్‌గా పంత్ నిలిచాడు. మరోవైపు పూరన్ కోసం రూ.21 కోట్లు వెచ్చించి లక్నో రిటైన్ చేసుకుంది.

లక్నో సూపర్ జెయింట్స్ (ధర- రూ.కోట్లలో)

రిషభ్ పంత్ (27), నికోలసన్ పూరన్ (21), రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్ (11), అవేశ్ ఖాన్ (9.75), ఆకాశ్ దీప్ (8), మిల్లర్ (7.50), సమద్ (4.20), మోసిన్, బదోని (4), మార్ష్ (3.40), షాబాజ్ (2.40), మార్క్రమ్ (2), బ్రిట్‌జ్కె, షమార్, సిద్ధార్థ్ (0.75), యువ్‌రాజ్ చౌదరి, ప్రిన్స్, ఆకాశ్, దిగ్వేశ్, హిమ్మత్, రాజ్‌వర్ధన్, ఆర్యన్, అర్షిన్ (0.30).

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్




## 80 వేల పాయింట్లు దాటిన సెన్సెక్స్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి నెమ్మదించడంతో.. దాని ప్రభావం ఆరంభంలో సూచీలపై పడింది. దీంతో నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. మధ్యాహ్నం తర్వాత రాణించాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 79,743.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,802.79) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేటికే మరింత నష్టాల్లోకి జారుకుని 79,308 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత కోలుకుని లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి ముగిసే సమయానికి సెన్సెక్స్ 445 పాయింట్లు లాభపడి 80,248కి ఎగబాకింది. నిఫ్టీ 144.95 పాయింట్ల లాభంతో 24,276.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 84.71 వద్ద ముగిసింది. సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్ (3.93 శాతం) ప్రధానంగా లాభపడింది. ఆపై జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72.68 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2659 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# తగ్గిన బంగారం, వెండి ధరలు

**విశ్వంభర, బిజినెస్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెండిండ్ల సీజన్ కొనసాగుతున్నది. అయినా, బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతున్నది. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర (24 క్యారట్స్) రూ.200 పతనమై రూ.79,100లకు చేరుకున్నది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.78,800 పలికింది. శుక్రవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.79,400 వద్ద స్థిర పడిన సంగతి తెలిసిందే. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం పది గ్రాములు ధర రూ.79 వేల వద్ద ముగిసింది. ఇక సోమవారం కిలో వెండి ధర రూ.2,200 తగ్గి రూ.90 వేల వద్ద నిలిచింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.92,200 వద్ద స్థిర పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ తులం ధర రూ.478 పతనమై రూ.75,896లకు చేరుకున్నది. మరోవైపు కిలో వెండి డిసెంబర్ డెలివరీ ధర రూ.574 పడిపోయి 88,307లకు చేరుకున్నది. అంతర్గత ట్రేడింగ్ లో కిలో వెండి ధర రూ.1,081 పడిపోయి రూ.87,800లకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 23.50 డాలర్లు పతనమై 2,657.50 డాలర్లకు చేరుకున్నది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఇంట్రాడే ట్రేడింగ్ లో పుత్తడి ఔన్స్ ధర 2621 డాలర్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఔన్స్ వెండి ధర 1.36 శాతం తగ్గి, 30.69 డాలర్లు పలికింది.



## నైజాంలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఝాన్సీ ఐపీఎస్

ఆర్కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాతగా, బ్యూటీ క్వీన్ లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళంలో విడుదలై ఘన విజయాన్ని సాధించిన ఝాన్సీ ఐపీఎస్ చిత్రం గత నెల 29న నైజాంలో ఏరియాలో గ్రాండ్‌గా రిలీజైంది. 45 థియేటర్స్ లో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. మహిళా ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరిస్తున్నారు. నైజాం ఏరియాలో వస్తున్న అపూర్వ ఆదరణ నేపథ్యంలో ఈ నెల రెండో వారంలో ఆంధ్ర, సీడెడ్ లో ఈ సినిమాను ఘనంగా విడుదల చేసేందుకు నిర్మాత ఆర్.కె. గౌడ్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. ఝాన్సీ ఐపీఎస్ సినిమాను ఇటీవల నైజాం ఏరియాలో 45 థియేటర్స్ లో ఘనంగా రిలీజ్ చేశాం. ప్రతీ సెంటర్ నుంచి సూపర్ హిట్ టాక్ వస్తోంది. హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో సినిమా ప్రదర్శితమవుతోంది. మహిళా ప్రేక్షకులు సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారు. మూవీలో మూడు డిఫరెంట్ రోల్స్ లో లక్ష్మీ రాయ్ పర్ ఫార్మెన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా లక్ష్మీరాయ్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు హైలైట్‌గా నిలిచాయని ఫీడ్ బ్యాక్ వస్తోంది. ఈ ఆదరణతో ఆంధ్ర, సీడెడ్ లో ఈ నెల రెండో వారంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. నైజాంలో వచ్చిన సక్సెస్‌ను ఆంధ్ర, సీడెడ్‌లోనూ ప్రేక్షకులు అందిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.

## కన్నప్పలో అరియానా, వివియానా ఫస్ట్ లుక్స్ విడుదల



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన కన్నప్ప చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ ఆడియెన్స్‌లో అంచనాలు పెంచేస్తూనే ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. అత్యంత భారీ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అయిన ఈ 'కన్నప్ప' ఏప్రిల్ 25, 2025న విడుదల కానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను సోమవారం రిలీజ్ చేశారు. కన్నప్ప ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ సోమవారం ఓ అప్డేట్ ఇస్తామని మేకర్లు ఇది వరకు ప్రకటించారు. ఇందులో భాగంగా విష్ణు మంచు కవల పిల్లలు అరియానా మంచు, వివియానా మంచు ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. ఈ రోజు వారి పుట్టినరోజులు కావడం కూడా విశేషం. ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. ఈ మేరకు విష్ణు మంచు పోస్ట్ చేస్తూ.. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ క్షణంలో నా హృదయం గర్వంతో ఉప్పొంగుతోంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూసేందుకు నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.



## సంప్రదాయ చీర కట్టులో సిగ్గులొలికిస్తున్న 'శోభితా'

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్నారు. కాగా, మరో రెండు రోజుల్లో అనగా డిసెంబర్ 4న బుధవారం రాత్రి 8.13 గంటలకు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లోని ఏయన్నార్ విగ్రహం వద్ద వివాహం జరగనుంది. పెళ్లికి ఇంకా రెండ్రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వధువు శోభితను సోమవారం పెళ్లికూతురిగా ముస్తాబు చేసి మంగళ హారతులు ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను శోభిత తాజాగా, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఇందులో ఆమె సంప్రదాయ చీర కట్టులో మెరిసిపోతూ సిగ్గులొలికించారు. ప్రస్తుతం శోభిత నవ్వుతూ సినీ ప్రియులను ఆకర్షిస్తోంది. కాగా ఇటీవలే హల్దీ వేడుక ఫొటోలను శోభితా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో తెగ వైరల్ అయ్యాయి. ఇదిలా ఉండగా, నాగచైతన్య, శోభిత మధ్య పరిచయం దాదాపు రెండేళ్ల క్రితం మొదలైంది. ముంబైలో జరిగిన ఓ ఓటీటీ ఈవెంట్‌లో ఇద్దరం తొలిసారి కలుసుకున్నామని, మాటల్లోనే తన మంచి మనసు నన్ను కట్టిపడేసిందని చెప్పుకొచ్చారు. ఇద్దరికీ ఎన్నో ఉమ్మడి పోలికలు ఉన్నాయని, ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నామని వెల్లడించారు. తను కుటుంబానికి ఎంతో ప్రాధాన్యమిస్తుంటుందిదని, అందుకే ఆమెతో కలిసి జీవితం పంచుకోవడానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్నన్నారు. ఇక, శోభిత.. చైతూ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్న విషయం తెలిసిందే. తను చాలా కూల్‌గా, కామ్‌గా ఉంటాడని, ఆడంబరాలను ప్రదర్శించడని పేర్కొంది. దీంతో పాటు అందరితో హుందాగా వ్యవహరిస్తుంటాడని, ఎదుటివారికి ఎంతో గౌరవం ఇవ్వడం వంటి లక్షణాలు బాగా నచ్చాయని శోభిత చెప్పింది.



## అసలే మిల్క్ బ్యూటీ.. ఆపై వైట్ డ్రెస్సు!

మిల్క్ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిత్యం తన గ్లామరస్ ఫోటోలతో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది. తాజాగా, వైట్ కలర్ డ్రెస్సులో ఫోటోలకు ఫోజులిచ్చింది. అసలే మిల్క్ బ్యూటీ.. ఆపై వైట్ డ్రెస్ వేసుకోవడంతో ఏంజెల్‌లా కనిపిస్తోంది. తమన్నా.. 15 ఏళ్ల క్రితం సినిమాల్లోకి వచ్చినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పటికే అదే ఫిజిక్ మైంటైన్ చేస్తున్నారు. ముఖ్యంగా తమన్నా నడుముకు చాలా మంది ఫాన్స్ ఉన్నారు. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీలో మిల్కీ బ్యూటీ తమన్నా క్రేజ్ ఎలా ఉంది అంటే... తమన్నా అంటే ఐటమ్ సాంగ్, ఐటెం సాంగ్ అంటే తమన్నా అన్నట్టుగా మారింది. రీసెంట్‌గా ఆమె చేసిన ఐటమ్ సాంగ్స్ దుమ్ము రేపాయి. దీంతో తెరపైకి ఏమైనా బిగ్ ప్రాజెక్ట్స్ వస్తున్నాయంటే చాలు తమన్నా చిందేస్తే అదిరిపోతుంది అన్న అభిప్రాయంలో మేకర్స్‌తో పాటు ప్రేక్షకులు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తమన్నా స్పందిస్తూ.. ఈ విషయం గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. తను ఐటెం సాంగ్‌లో నటించిన సినిమాలు సక్సెస్ అవడం ఒక పక్క ఆనందంగానే ఉన్నా.. దర్శక నిర్మాతలు వరుసగా ఐటమ్ సాంగ్స్ చేయమంటే ఎలా అంటూ తమన్నా అసహనం వ్యక్తం చేసింది. సూపర్ స్టార్ రజనీ సర్ అంటే అభిమానంతోనే 'జైలర్' సినిమా చేశానని, అమర్ కౌశిక్ మంచి ఫ్రెండ్ కావడంతో 'స్త్రీ 2' సినిమాలో ఐటెం సాంగ్‌కి ఓకే చెప్పానని తెలియజేసింది. వరుసగా ఇలా ఐటెం సాంగ్‌లు చేయడానికి నేను ఐటెం గర్ల్ కాదని మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఇదిలా ఉండగా, తమన్నా తొలిసారిగా శ్రీ మూవీతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. అప్పటి నుంచి తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటించి సూపర్ క్రేజీ సంపాదించుకుంది. ఈ బ్యూటీ సినిమాల్లో అలరించడంతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా, ఈ అమ్మడు వైట్ కలర్ డ్రెస్సులో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్స్‌ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 50 రోజుల చేరువలో C.202

మైటీ ఒక్ పిక్చర్స్ బ్యానర్ పై మనోహరి కె ఎ నిర్మాతగా మున్నా కాశీ హీరోగా నటించి దర్శకత్వం వహించిన హర్రర్ థ్రిల్లర్ చిత్రం C.202 అక్టోబర్ 25న విడుదలై ఆరు వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పట్టణాలు అయినా విజయవాడ, విశాఖపట్నం, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ ఇతర ప్రాంతాల్లో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. మరో వరంతో 50 రోజుల మైలు రాయిని చేరుకుంటుంది. ఈ సందర్భంగా హీరో దర్శక నిర్మాత మున్నా కాశీ మాట్లాడుతూ C.202 చిత్రం అక్టోబర్ 25న రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల అయింది. మంచి రివ్యూస్ మౌత్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ పొంది ఆరు వారాలుగా విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇప్పుడు మా చిత్రం ఏడో వరంలోకి ప్రవేశించింది. ఇప్పటికే 50 లక్షల షేర్ వసూళ్లు చేసింది. మరో వారం రోజుల్లో 50 రోజుల మైలురాయి చేరుకుంటుంది. C.202 చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు మా ధన్యవాదాలు" అని తెలిపారు.



## 13న విడుదలకు సిద్ధమైన మిస్ యు

హీరో సిద్ధార్థ్ నటించిన లేటెస్ట్ మూవీ మిస్ యు. ఎన్ రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 13న గ్రాండ్ రిలీజ్ కి సిద్ధం అవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 7 మైల్స్ పర్ సెకండ్ సంస్థ నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటించారు. లవ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో సిద్ధార్థ్ మునుపటిలా తనలోని రొమాంటిక్ వైబ్స్ చూపించబోతున్నాడు. అదే విధంగా ఈ చిత్ర కథ ఫీల్ గుడ్ కంటెంట్ తో ఉండబోతోంది. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ.. ప్రేమలో ఉన్న బలహీనతల చుట్టూ ఈ చిత్ర కథ ఆకట్టుకునే విధంగా ఉంటుంది. బ్రేకప్ తర్వాత కూడా ప్రేమ ఎంత బలంగా మారుతుందో అని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో జేపీ, పోన్వన్నన్, బాల శరవణన్, కరుణాకరన్ లాంటి నటులు నటించారు. జిబ్రాన్ సంగీతం అందించారు. కేజీ వెంకటేష్ సినిమా టోగ్రాఫర్ గా వ్యవహరించారు. సంగీతంతో పాటు సినిమాలోని విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ప్రేమలో సెకండ్ ఛాన్స్ వస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని ఎంటర్టైనింగ్‌గా అదే సమయంలో ఎమోషనల్‌గా చెప్పినట్లు చిత్ర యూనిట్ పేర్కొన్నారు. తెలుగు, తమిళ్ లో కుడా డిసెంబర్ 13న రిలీజ్ అవుతున్న మిస్ యు చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూషన్ చేస్తోంది.





## 'సారంగపాణి జాతకం' రెండో పాట విడుదల

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన సినిమా సారంగపాణి జాతకం. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. జెంటిల్‌మన్, సమ్మోహనం చిత్ర విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20న థియేటర్లలోకి వస్తుంది సినిమా. టైటిల్ సాంగ్ 'సారంగో సారంగో...' కొన్ని రోజుల క్రితం విడుదలైంది. రెండో పాట 'సంచారి... సంచారి... సని సోమవారం విడుదల చేశారు.

## సిల్క్ స్మిత బయోపిక్ అనౌన్స్



లెజెండరీ యాక్ట్రెస్ సిల్క్ స్మిత పుట్టినరోజు సందర్భంగా ఎస్టీఆర్ఐ సినిమాస్ తన అప్ కమింగ్ చిత్రం "సిల్క్ స్మిత - క్వీన్ ఆఫ్ ద సౌత్"ని అనౌన్స్ చేసింది. ఈ అఫీషియల్ బయోపిక్‌లో చంద్రిక రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జయరామ్ శంకరన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్బీ విజయ్ అమృతరాజ్ నిర్మించనున్న ఈ చిత్రం 2025 ప్రారంభంలో ప్రొడక్షన్‌ని ప్రారంభించనుంది. సిల్క్ స్మిత పుట్టినరోజు సందర్భంగా ఈ స్పెషల్ అనౌన్స్ మెంట్ కి గుర్తుగా మేకర్స్ ఒక ప్రత్యేకమైన వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోతో సిల్క్ స్మిత - సౌత్ క్వీన్ గురించి ప్రేక్షకులకు ఒక గ్లింప్స్ అందించారు.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం విశ్వంభర తెలుగు దినపత్రిక అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com